
# గీటురాయి

సహజీవన భావనల పావురాయి

వారపత్రిక 28-8-2026 ₹ 15/-


ప్రవక్త ముహమ్మద్ (స) జన్మదినం సందర్భంగా ప్రత్యేక వ్యాసావళి

# నేటి సమస్యలకు నాటి పరిష్కారాలు



సీరతున్నబీ ప్రత్యేక సంచిక

# గీటురాయి

వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

**Our Bank A/c Details:**
Geeturai Weekly, A/c No.1042789768
IFSC : CBIN0282407, Central Bank of India
Noor Khan Bazar Branch, Hyderabad

సంపుటి: 48 సంచిక: 35 హైదరాబాద్
శుక్రవారం 28 ఆగస్టు 2026 రూ.15-00
రబీఉల్ అవ్వల్ 14 1448 హిజ్రీ


**తొలిగీటు**

ఏ వ్యక్తి ఒకసారి నాకు దురూద్ పంపిస్తాడో ఆ వ్యక్తిపైన దేవుడు పదిసార్లు తన కారుణ్యాన్ని కురిపిస్తాడు.

*- ముహమ్మద్ ప్రవక్త (స)*


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**గ్రాఫిక్స్**
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**


## మీలాదున్నబీ



శాంతికి మార్గం చూపిన
మానవీయ సందేశమిది
ప్రేమను జగతికి పంచిన
మిలాదున్నబి మాసమిది!

కోపం ద్వేషము వీడగా
మంచి మార్గం నడవాలి
కారుణ్యం మది నిండగా
దీనుల సేవను చేయాలి!

*- యం.డి. ఉస్మాన్ ఖాన్*

## లోపల...


| | |
|---|---|
| ప్రవక్త జీవితం ...... | 04 |
| నేటి సమస్యలకు నాటి పరిష్కారాలు ...... | 05 |
| ప్రవక్త (స) ఆదర్శాలు ఆత్మపరిశీలన ఆచరణల సమ్మేళనం ...... | 09 |
| ముహమ్మద్ ప్రవక్త (స) : మానవాళి విమోచకుడు ... ...... | 12 |
| మారుతున్న కాలం మారని ప్రవక్త సందేశం ...... | 14 |
| ప్రవక్త (స) గారి నమాజ్ ...... | 16 |
| వెలుగుబాట (తఫ్హీముల్ ఖుర్ఆన్ అనువాదం) ...... | 18 |
| అడుగుజాడలు (సహీహ్ బుఖారీ అనువాదం) ...... | 19 |
| ముహమ్మద్ ప్రవక్త (స) పట్ల మన బ్యాతలు ...... | 20 |
| ప్రవక్త (స) బాట మానవతకు వెలుగుబాట ...... | 23 |
| కార్మికుల హక్కుల రక్షణలో ప్రవక్త (స) చూపిన మార్గం...... | 27 |
| ఇంట్లోనే స్వర్గ సీమ ...... | 30 |
| కనువిప్పు ...... | 33 |
| హిరా గుహలో మక్కా చంద్రుడు ...... | 34 |

# ఆలోచన

## ప్రవక్త జీవితం

ప్రవక్త ముహమ్మద్ (స) జీవితచరిత్రపై తెలుగుభాషలో అచ్చయిన పుస్తకాలను పరిశీలిస్తే కేవలం వేళ్ళపై లెక్కించవచ్చు. ప్రపంచంలో పిల్లలకు పెట్టుకునే పేర్లలో అత్యధికంగా పెట్టుకునే పేరు ప్రవక్త ముహమ్మద్ పేరు. ఇంగ్లీషు,ఉర్దూ తదితర భాషల్లో ప్రవక్త ముహమ్మద్ జీవితచరిత్రపై అనేక పుస్తకాలు వచ్చాయి. కాని తెలుగులో పుస్తకాల సంఖ్య పరిమితమే.

1960 కన్నా ముందు ప్రవక్త ముహమ్మద్ జీవిత చరిత్రపై వచ్చిన పుస్తకాలను పరిశీలిస్తే, "జగత్ ప్రవక్త హజ్రత్ ముహమ్మదు పైగంబరుల వారి దివ్యచరితము" పేరుతో ఒక పుస్తకం అచ్చయింది. ఈ పుస్తకం 1935లో ముద్రించబడింది. ఈ పుస్తక రచయిత మౌల్వి మున్షీ ఫాజిల్ ముహమ్మద్ అబ్దుల్ గఫూర్. మౌల్వి మున్షీ ఫాజిల్ ముహమ్మద్ అబ్దుల్ గఫూర్ కర్నూలు జిల్లాకు చెందినవారు. సాధారణంగా తెలుగులో రాయబడిన ప్రవక్త జీవిత చరిత్ర పుస్తకాలు అనువాదాలు. కాని మౌల్వి గఫూర్ గారి పుస్తకం అనువాదం కాదు. ఇది స్వతంత్రరచన. అరబీ, ఉర్దూ భాషల్లో పండితుడైన మౌల్వీ గఫూర్ గారు స్వంతంగా రాసిన పుస్తకం ఇది. ఈ పుస్తకాన్ని చిత్తూరు డిస్ట్రిక్ట్ ప్రింటింగ్ ప్రెస్ వారు ముద్రించారు.

ఆ తర్వాత "శ్రీ మహమ్మద్ రసూల్ వారి చరిత్ర" పేరుతో శ్రీ ఉమర్ అలీషా కవి ప్రవక్త జీవిత చరిత్ర పుస్తకాన్ని రాశారు. శ్రీ ఉమర్ అలీషా కవి పిఠాపురానికి చెందినవారు. శ్రీ ఉమర్ అలీ షా కవి గ్రంథప్రచురణ సంఘము వారు ఈ పుస్తకాన్ని ప్రచురించారు. ఈ పుస్తకం 1955లో ప్రచురించబడింది. ఈ పుస్తకం కూడా అనువాదం కాదు, స్వతంత్ర రచన.

ప్రొఫెసర్ కే.యస్.రామకృష్ణారావు ఇంగ్లీషులో Muhammad The Prophet of Islam పుస్తకం రాశారు.

ఈ పుస్తకాన్ని ఎస్.ఎమ్.మలిక్ "ఇస్లామ్ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహివసల్లం)" పేరుతో అనువదించారు. ఈ పుస్తకాన్ని తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ సంస్థ ప్రచురించింది.

క్యారెన్ ఆర్మ్ స్ట్రాంగ్ ఇంగ్లీషులో Muhammad: A Biography of the Prophet పుస్తకం రాశారు. ఈ పుస్తకాన్ని పి.సత్యవతి తెలుగులో "ఉదయ కాంతిరేఖ ముహమ్మద్ ప్రవక్త" పేరుతో అనువదించారు. హైదరాబాద్ బుక్ ట్రస్ట్ 2010లో ఈ పుస్తకాన్ని ప్రచురించింది.


మైకెల్ హెచ్.హార్ట్ The 100: A Ranking of The Most Influential Persons in History పుస్తకం రాశారు. ఈ పుస్తకాన్ని అబ్దుల్ అలీమ్, కే.ఎం.అబ్దుస్సుభాన్ కలిసి అనువదించారు. నెల్లూరుకు చెందిన సామాజిక అధ్యయన వేదిక ఈ పుస్తకాన్ని ప్రచురించింది. "సీరతున్నబీ" పుస్తకాన్ని అల్లామా షిబ్లీ నోమానీ ఉర్దూలో రాశారు. ఈ పుస్తకాన్ని ఉర్దూ నుంచి తెలుగులో ముహమ్మద్ అజీజుర్రహ్మాన్ అనువదించారు. "కారుణ్యకడలి" పేరుతో మొదట "క్రిస్టల్ ఎడ్యుకేషనల్, వెల్ఫేర్ అండ్ చారిటబుల్ ట్రస్ట్" ప్రచురించింది. తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ సంస్థ 2024 నుంచి పునర్ముద్రిస్తోంది. "అర్రహీఖుల్ మఖ్తూమ్" గ్రంథాన్ని మౌలానా సఫీవుర్రహ్మాన్ ముబారక్ పురి రాశారు. ఈ పుస్తకాన్ని ఉర్దూ నుంచి తెలుగులోకి యస్.యమ్. ఖాద్రీ అనువదించారు. అల్ హఖ్ తెలుగు పబ్లికేషన్స్ 2008లో ప్రచురించింది. ముహ్సినె ఇన్సానియత్ పుస్తకాన్ని నయీమ్ సిద్దీఖీ రాశారు. ఈ పుస్తకాన్ని అబ్దుల్ వాహెద్ తెలుగులో అనువదించారు. తెలుగు అనువాదం పేరు "మానవమహోపకారి ముహమ్మద్ (స)". తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ సంస్థ ఈ పుస్తకాన్ని ప్రచురించింది. "దుర్రెయతీమ్" పేరుతో మౌలానా మాహిరుల్ ఖాద్రీ ప్రవక్త జీవిత చరిత్ర రచించారు. ఈ పుస్తకాన్ని అబ్దుర్రహ్మాన్ అనువదించారు. పుస్తకాన్నిఎడారిపువ్వు పేరుతో తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ సంస్థ ప్రచురించింది. "హయాతె తయ్యిబా" మౌలానా అబూ సలీమ్ అబ్దుల్ హై రచించిన పుస్తకం. ఈ పుస్తకాన్ని "మహాప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం" పేరుతో ఎస్.ఎం.మలిక్ తెలుగులో అనువదించారు. తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ సంస్థ ప్రచురించింది.

గీటురాయి సంపాదకులు ప్రవక్త జీవిత చరిత్రపై రచించిన సమగ్ర గ్రంథం "ఆదర్శమూర్తి ముహమ్మద్ (స)". ఈ పుస్తకాన్ని తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ప్రచురించింది. ఇది అనువాదం కాదు, ఆయన స్వతంత్ర రచన. ప్రొద్దటూరుకు చెందిన ఇబ్నె జాఫర్ వ్రాసి స్వయంగా ప్రచురించిన "ఆదర్స్ ప్రవక్త" కూడా వారి స్వతంత్ర రచనే.

ప్రవక్త జీవిత చరిత్రపై తెలుగులో వచ్చిన పుస్తకాలు లెక్కకు తక్కువే. మక్కా నగరంలో ప్రవక్త జీవితం. అక్కడ ఆయన వివిధ సవాళ్ళను ఎలా ఎదుర్కొన్నారు. మక్కా కాలంలో ముస్లిమేతర ప్రాంతంలో సత్యధర్మం కోసం ఎలాంటి ప్రయత్నాలు చేశారు. అలాగే మదీనా నగరంలో ఆయన జీవితం. మదీనాలో ఇస్లామీయ రాజ్యస్థాపన. మదీనా కాలంలో ఎదుర్కున్న సవాళ్ళు ఎలాంటివి? ప్రవక్త జీవితంలో సామాజిక, రాజకీయ కోణాలు మాత్రమే కాదు, ఒక తండ్రిగా, ఒక తాతగా, ఒక భర్తగా, పొరుగువానిగా, ప్రత్యర్థిగా, మిత్రునిగా, పాలకునిగా, సంస్కర్తగా, మతబోధకునిగా, సేనాధ్యక్షుడిగా, వ్యాపారిగా, యజమానిగా ఇలా వివిధ పాత్రల్లో ఆయన జీవితాన్ని అధ్యయనం చేయడానికి అవసరమైన సాహిత్యం తెలుగు భాషలో అందుబాటులో లేదు. ప్రవక్తజీవితాన్ని వివిధ కోణాల్లో ఆవిష్కరించే పుస్తకాల అవసరం తెలుగులో ఎంతైనా ఉంది. ✤

అబ్దుల్ వాహెద్

# నేటి సమస్యలకు నాటి పరిష్కారాలు



**ముహమ్మద్ ప్రవక్త (స)** కేవలం మత ప్రవక్త మాత్రమే కాదు. ఆయన జీవిత చరిత్రను అధ్యయనం చేస్తే నేటి ప్రపంచంలో అనేక సవాళ్ల పరిష్కారానికి దారి చూపించే కాంతిమార్గంగా కనిపిస్తుంది. నేడు మనకు కనిపిస్తున్న అనేక సమస్యలు– వ్యాపారంలో అవినీతి, రాజకీయ అస్థిరత, పేదరికం, స్త్రీపురుష అసమానత, పర్యావరణ సంక్షోభాలు వంటి ఆధునిక సమస్యల పరిష్కారం కూడా ఈ జీవితచరిత్రలో మనకు అర్థమవుతుంది. ఆయన జీవితంలో నిజాయితీ, న్యాయం, కరుణ, వివేకం, నాయకత్వపటిమకు సంబంధించిన అనేక సంఘటనలు ఆధునిక సవాళ్ళను పరిష్కరించే పాఠాలు చెబుతాయి. ఒక వ్యాపారవేత్తగా, రాజకీయ నాయకుడిగా, మతప్రవక్తగా, సంఘ సంస్కర్తగా, నగర రూపకర్తగా ఆయన జీవితాన్ని పరిశీలిస్తే లభించే స్ఫూర్తి అమూల్యమైనది, అనేక సవాళ్ళను పరిష్కరించేది.

## వ్యాపారవేత్త :

ప్రవక్తగా ఆయన ప్రకటనకు ముందు ముహమ్మద్ (స)మక్కాలో వ్యాపారి. వ్యాపారమంటే ఏదోలా మోసం చేసి అమ్మకాలు పెంచుకోవాలి, లాభాలు గడించాలనే ధోరణి ప్రబలంగా ఉన్న కాలంలో ఆయన అనేకమంది వ్యాపారులకు భిన్నంగా నిజాయితీకి మారుపేరుగా నిలిచారు. సమాజంలో అత్యంత విశ్వసనీయుడిగా ఆయన్ను చివరకు శత్రువులు కూడా ఒప్పుకోవడమే కాదు, కీర్తించేవారు.

ఖదీజా (రజి) వాణిజ్య బిడారును ఆయన(స) నిర్వహించినప్పుడు, ఆయన తనకు ప్రయోజనం లభించే వ్యాపార లావాదేవీల్లో కూడా నిజాయితీగా, న్యాయంగా వ్యవహరించారని ఆ బిడారుతో వెళ్ళిన ఖదీజా (రజి) నౌకరు మైసరా ఆమెకు నివేదించారు. ఆయన నిజాయితీ, న్యాయబద్ధత ఆమెను ఎంతగా ప్రభావితం

చేశాయంటే ఆయన్ను తన జీవిత భాగస్వామిగా ఆమె ఎంచుకున్నారు. చివరకు వారిద్దరి వివాహం జరిగింది. ఒక పవిత్ర భాగస్వామ్యానికి నాంది పలికింది.

ఆయన నిజాయితీకి సంబంధించి మరో ముఖ్యమైన సంఘటన కూడా ప్రస్తావించుకోవాలి. మక్కాలో శత్రువుల కుట్రలు పెరిగిపోయి, ప్రాణప్రమాదం పొంచి ఉన్నప్పుడు ఆయన మక్కా వదిలి మదీనా తరలిపోవాలని నిర్ణయించారు. ఆ కాలంలో ఇప్పటి మాదిరిగా బ్యాంకులు, బ్యాంకు లాకర్లు లేవు. అందువల్ల మక్కా ప్రజలు చాలా మంది తమ సంపద, వస్తువులు ఆయన వద్ద దాచుకునేవారు. ఆయన ప్రచారం చేస్తున్న ధర్మం పట్ల వ్యతిరేకతతో ఆయన పట్ల ద్వేషం ఉన్నవారు కూడా తమ వస్తుసంపదలు ఆయన వద్ద దాచుకునేవారు. ఎందుకంటే ఆయనకు మించి విశ్వసనీయుడు మరెవరు లేరు. మక్కా వదిలి వెళ్ళాలని నిర్ణయించిన ప్రవక్త (స) తన వద్ద ప్రజలు దాచుకున్న వస్తుసంపద ఎవరిది వారికి చేరవేసే ఏర్పాటు చేసి వెళ్ళారు. అలీ (రజి)కు ఆ బాధ్యత అప్పగించారు. అందువల్లనే ఆయన (స)ను అత్యంత విశ్వసనీయుడిగా శత్రువులు కూడా కీర్తించేవారు.

ప్రవక్త(స) పట్ల అత్యంత వ్యతిరేకత కనబరిచి, యుద్ధాలు చేసిన సుఫియాన్ (రజి) కూడా తన వ్యాపార లావాదేవీల్లో ఆయన్ను పూర్తిగా నమ్మేవారు. మక్కావిజయం తర్వాత సుఫియాన్ (రజి) కూడా ఇస్లాం స్వీకరించారు.

## వ్యాపార లావాదేవీల్లో నిజాయితీ అనేది నేటి అనేక సమస్యలకు పరిష్కారం

అవినీతి, పన్ను ఎగవేత, కార్పొరేట్ దురాశ ప్రపంచవ్యాప్తంగా ప్రధాన సమస్యలు. అనైతిక పద్ధతుల ద్వారా వ్యాపార సంస్థలు లాభాలు పెంచుకొంటుంటే ప్రజలు నష్టపోతున్నారు. అవినీతిని ఆసరా చేసుకున్న వ్యాపారసంస్థలు కూడా వినియోగదారుల నమ్మకాన్ని కోల్పోతున్నాయి. చివరకు అపనమ్మకం రాజ్యం చేస్తోంది.

"సత్యవంతుడైన వ్యాపారి ప్రవక్తలు, సత్యవంతులు, అమరవీరులతో పాటు ఉంటాడని" ప్రవక్త చెప్పారు. ఈ సూత్రాన్ని నేడు వ్యాపారసంస్థలు పాటిస్తే వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లడమే కాదు దేశానికి అవసరమైన బలమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించగలరు.

## రాజకీయ నాయకత్వం

ప్రవక్త (స) మదీనాకు వలస వెళ్ళినప్పుడు, అక్కడ అనేక సవాళ్ళు ఎదురయ్యాయి. అక్కడి యూదులతో, ముస్లిమేతర తెగలతో ఘర్షణల పరిస్థితి తలెత్తింది. ఆయన బలవంతంగా తన రాజ్యాధికారాన్ని స్థాపించలేదు. అక్కడి రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకుని, మదీనా రాజ్యాంగాన్ని సృష్టించారు, తద్వారా అన్ని వర్గాలకు సమాన హక్కులు, బాధ్యతలతో పాలనావ్యవస్థకు పునాది వేశారు. వివిధ వర్గాలతో ఒప్పందాల ద్వారా బలమైన రాజ్యం స్థాపించారు.

"విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ కొరకు సత్యంపై స్థిరంగా ఉండండి. న్యాయానికి సాక్షులుగా ఉండండి. (ఏదైనా) వర్గంతో ఉన్న వైరం కారణంగా మీరు ఆవేశానికి లోనయి న్యాయాన్ని త్యజించకండి. న్యాయం చెయ్యండి. ఇది దైవభక్తికి సరిసమానమైనది." (ఖురాన్ 5:8).

దివ్యఖుర్ఆన్ లోని ఈ వాక్యం న్యాయం ఎంత ముఖ్యమైనదో చాటి చెబుతుంది. సమాజంలో స్పర్థలు, వైషమ్యాలు, విరోధాలు సమసిపోవాలంటే న్యాయాన్ని నిలబెట్టాలి. మదీనా రాజ్యంలో న్యాయం విషయంలో ముస్లిములకు ముస్లితేరులకు అందరికీ సమానన్యాయం లభిస్తుందన్న నమ్మకాన్ని ఆయన సృష్టించారు. నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ఇది పరిష్కారం. న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉన్నప్పుడు సమాజంలో కల్లోలం తలెత్తదు.

## సంఘ సంస్కర్త

ఇస్లాంకు పూర్వం అరబ్బు సమాజంలో మహిళలకు వారసత్వ హక్కులు లేవు. నిజానికి మహిళలకు వారసత్వ హక్కులు ప్రపంచంలో చాలా చోట్ల ఉండేవి కావు. మహిళలను క్రయవిక్రయాల ఆస్తిగా భావించే కాలం అది. పేదలు, అనాథలు అణిచివేతకు గురయ్యేవారు. సంపన్నులు విలాసాల్లో మునిగి తేలుతుంటే పేదలు పస్తులుండేవారు. సామాజిక సంబంధాలలో తెగల అహంకారానిదే ఆధిపత్యం. ఇప్పుడు కూడా ప్రపంచంలో చాలా చోట్ల ఈ అసమానతలు మనకు కనిపిస్తాయి. మహిళల పరిస్థితి చాలా దయనీయంగా ఉండేది. ఆడపిల్ల పుడితే అవమానంగా భావించేవారు, పేదరికం వల్ల పెంచలేమనుకునేవారు. పుట్టిన ఆడపిల్లను చంపడానికి వెనుకాడని అజ్ఞాన కాలం అది.

ఒక వ్యక్తి ప్రవక్త సమక్షంలో తాను చేసిన ఇలాంటి అఘాయిత్యం గురించి చెప్పుకున్నాడు. చిన్నారిని సజీవంగా పాతిపెట్టిన ఆ సంఘటన విని ప్రవక్త (స) కన్నీళ్లు ఆపుకోలేకపోయారు. కన్నీళ్లతో ఆయన గడ్డం తడిసిపోయింది. కుమార్తెలు భారం కాదని దేవుని ఆశీర్వాదమని ఆయన ప్రజలకు బోధించారు. "ఇద్దరు కుమార్తెలు పెద్దవారయ్యే వరకు వారిని ప్రేమగా పెంచేవాడు, తీర్పు దినాన తన సహచర్యంలో ఉంటాడని" సెలవిచ్చారు. ఆయన సంస్కర ణాత్మక చర్యల వల్ల ఆడపిల్లలను హతమార్చే దురాచారం అంత మయ్యింది. మహిళలకు వారసత్వ హక్కులే కాదు, పూర్తి రక్షణ లభించింది. వితంతు పునర్వివాహానికి కూడా ప్రవక్త (స) ఆచరణ, బోధనలు కారణమయ్యాయి.

శతాబ్దాలు గడిచినా, మహిళలు, పేదలపై వివక్ష నేటికీ ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతూనే ఉంది. కొన్ని సమాజాలలో, మహిళ లకు విద్య, వారసత్వంలో సమాన అవకాశాలు ఇంకా నిరాక రించబడుతున్నాయి. బాలికలు బాల్య వివాహాలు, బలవంతపు చాకిరీ, హింసలను ఎదుర్కొంటున్న బాలికలు అనేకమంది ఉన్నారు. ఇటీవల బట్టబయలైన ఎప్ స్టీన్ ఫైల్స్ ఈ వాస్తవాలను చాటి చెబుతున్నాయి.

మహిళలపై అఘాయిత్యాలు ఒకవైపు, మరోవైపు పేదలు, బలహీనవర్గాలపై అణిచివేతలు కొనసాగుతున్నాయి. జాత్యాహం కారం, వర్గ ఆధిపత్యం, మతోన్మాదం నేటికి కూడా అశాంతికి అలజడికి కారణమవుతున్నాయి. ఈ సమస్యలకు పరిష్కారం ప్రవక్త (స) తుది హజ్ ప్రసంగంలో మనకు కనిపిస్తుంది.

ఆయన ఏమన్నారంటే –

"మానవాళి అంతా ఆదమ్ హవ్వాల సంతానం. అరబేతరుడిపై అరబ్‌కు ఎలాంటి ఆధిక్యతా లేదు, అరబ్‌పై అరబేతరుడికి ఎలాంటి ఆధిక్యతా లేదు; నల్లజాతీయుడిపై తెల్లజాతీయుడికి ఎలాంటి ఆధిక్యతా లేదు, అలాగే తెల్లజాతీయుడిపై నల్లజాతీ యుడికి ఎలాంటి ఆధిక్యతా లేదు – కేవలం దైవభీతి విషయంలో తప్ప"

ఈ ప్రకటన విప్లవాత్మకమైనది. నైతిక, ధార్మిక ప్రమాణాలే మానవ విలువలను కొలమానంగా ఆయన మార్చారు.

## దోష సవరణ

**సహీహ్ బుఖారీ మొదటి సంపుటం 326వ పేజీలోని 392వ హదీసులో తప్పు దొర్లింది. మహనీయులు ముహమ్మద్ (స) బైతుల్ మఖ్దిస్ వైపునకు తిరిగి పదహారు సంవత్సరాల వరకో లేదా పదిహేడు సంవత్సరాల వరకో నమాజు చేశారు అని ప్రింట్ అయింది. దానిని పదహారు నెలల వరకో లేదా పదిహేడు నెలల వరకో నమాజు చేశారు అని సవరించుకోవలసినదిగా మనవి. జరిగిన పొరపాటుకు చింతిస్తున్నాము.**

**– ప్రకాశకులు,**

**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్**

## పర్యావరణ పరిరక్షణ

ప్రజలు ప్రకృతి విలువ గురించి అరుదుగా ఆలోచించే సమ యంలో ప్రవక్త (స) పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించారు.

ప్రళయం వస్తున్న క్షణమైనా సరే, చేతిలో ఒక మొక్క ఉంటే దానిని నాటాలని చెప్పారు.

ఆయన మదీనా చుట్టూ 'రక్షిత మండలాలను' ఏర్పాటు చేశారు, ఇక్కడ చెట్లను నరకడం లేదా వేటాడటం నిషేధించబడింది.

ఒక ప్రయాణంలో, సహచరులు పక్షి గూటి నుండి పిల్లలను తీసుకున్నారు. తల్లి పక్షి ఏడ్చినప్పుడు, ప్రవక్త (స) పిల్లలను వెంటనే తల్లివద్దకు చేర్చమని ఆదేశించారు.

నేడు, వాతావరణ మార్పు, అడవుల నరికివేత, కాలుష్యం మానవ మనుగడకు ముప్పుగా పరిణమించాయి. "నీరు ప్రవ హించే నది దగ్గర ఉన్నా సరే నీటిని వృథా చేయకండి" వంటి ప్రవక్త బోధనలు పర్యావరణ పరిరక్షణ, నీటిపొదుపు, భూతదయ వంటి అనేక విలువలను నేర్పుతున్నాయి.

## ఆహార భద్రత

మదీనాకు వలస వెళ్ళిన తరువాత, ప్రవక్త (స) అన్సార్లు (స్థాని కులు) తమ వ్యవసాయ భూములను ముహాజిరులతో (వలస వచ్చిన వారితో) పంచుకునేలా ప్రోత్సహించారు. చాలా మంది రైతులు తమ భూమిని భాగస్వామ్యంతో సాగు చేయాలన్నారు. ఆవిధంగా ఆహారభద్రతను సాధించడమే కాదు, సమాజంలో సోదరభావాన్ని, సంఘీభావాన్ని ప్రోత్సహించారు. నేడు ఆహార భద్రతకు ఆచరించవలసిన విధానాలు ఇందులో ఉన్నాయి. భూమిని సాగులోకి తీసుకురావడం, సమాజంలో భాగస్వామ్య

సాగుబడిని ప్రోత్సహించడం వంటి అనేక అంశాల్లో మనకు మార్గదర్శకత్వం లభిస్తుంది. వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, న్యాయబద్ధమైన పంటల భాగస్వామ్యం, న్యాయబద్ధమైన పంపిణీపై విధానాలకు మార్గనిర్దేశం చేసే బోధనలివి.

## నగర రూపకర్త

ముహమ్మద్ ప్రవక్త(స) మక్కా నుండి మదీనాకు వలస వెళ్ళినప్పుడు మొట్టమొదటి ప్రణాళికాబద్ధమైన నగరానికి పునాదులు కూడా వేశారు. ఆ కాలంలో సర్వసాధారణమైన అవ్యవస్థీకృతమైన తెగల జీవనాన్ని వ్యవస్థీకృతం చేశారు. ఆరాధన, పాలన, ఆర్థిక వ్యవస్థ, సమాజ జీవితం అన్నింటిని సమతుల్యంగా నగరరూపకల్పన చేశారు. అందుకోసం తీసుకున్న మొదటి చర్య ప్రవక్త మసీదు నిర్మాణం. ఇది కేవలం ఆరాధనాస్థలం మాత్రమే కాదు, సహచరులు ధర్మ జ్ఞానాన్ని నేర్చుకునే పాఠశాల, సంప్రదింపుల (షూరా) ద్వారా నిర్ణయాలు తీసుకునే చట్టసభ, వివాదాలను న్యాయంతో పరిష్కరించే న్యాయస్థానం, పేదలకు, ప్రయాణికులకు ఆశ్రయం కల్పించే సంక్షేమ కేంద్రం.

మసీదు చుట్టూ, కుటుంబాలు సమాజ జీవితానికి దగ్గరగా నివసించేలా ఆయన గృహాల కోసం భూమిని విభజించారు. మార్కెట్‌ను స్థాపించారు, అక్కడ వ్యాపారం ప్రోత్సహించారు. అవినీతి, గుత్తాధిపత్యం, అన్యాయమైన పన్నులు లేకుండా మోసాలు లేని మార్కెట్ లా అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నారు.

పరిశుభ్రత, ప్రజా సంక్షేమాన్ని గట్టిగా నొక్కి చెప్పారు "మార్గంలో ఉన్న ముల్లు తొలగించడం కూడా ధర్మకార్యమన్నారు" సివిక్ సెన్స్‌కు పెద్ద పీట వేశారు. నేడు, అనియంత్రిత పట్టణ వృద్ధి కారణంగా ప్రపంచవ్యాప్తంగా నగరాలు తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. పారిశధ్య వసతి లేని కిక్కిరిసిన మురికి వాడలు, ట్రాఫిక్ రద్దీ, మార్కెట్‌లో గుత్తాధిపత్యాలు, అవినీతి ఆధిపత్యం, పచ్చదనం లేకపోవడం వంటి అనేక సమస్యలున్నాయి. ఆధునిక నగరాలు లాభాపేక్ష, తక్షణ ప్రయోజనాలే ముఖ్యంగా విస్తరిస్తున్నాయ. ఫలితంగా వర్షం కురస్తే ముంపునకు గురవుతున్నాయి.

ఒక నగరం అంటే భవనాల సమూహం మాత్రమే కాదని, అది మనుషులు నివసించే సమాజం అని ముహమ్మద్ ప్రవక్త (స) చూపించారు. మసీదును కేంద్రంలో ఉంచడం ద్వారా ధార్మిక, నైతిక పౌరజీవనానికి పునాది వేశారు. నగరాల నడిబొడ్డున సమ్మిళిత కమ్యూనిటీ ప్రదేశాలు, పాఠశాలలు, గ్రంథాలయాలు, ఉద్యానవనాలు, సాంస్కృతిక కేంద్రాలను నిర్మించడం నగరాల పౌరజీవనానికి అవసరమని తెలియజేసే చర్య ఇది.

**పరిశుభ్రత, ప్రజా సంక్షేమాన్ని గట్టిగా నొక్కి చెప్పారు "మార్గంలో ఉన్న ముల్లు తొలగించడం కూడా ధర్మకార్యమన్నారు" సివిక్ సెన్స్‌కు పెద్ద పీట వేశారు. నేడు, అనియంత్రిత పట్టణ వృద్ధి కారణంగా ప్రపంచవ్యాప్తంగా నగరాలు తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. పారిశధ్య వసతి లేని కిక్కిరిసిన మురికి వాడలు, ట్రాఫిక్ రద్దీ, మార్కెట్‌లో గుత్తాధిపత్యాలు, అవినీతి ఆధిపత్యం, పచ్చదనం లేకపోవడం వంటి అనేక సమస్యలున్నాయి. ఆధునిక నగరాలు లాభాపేక్ష, తక్షణ ప్రయోజనాలే ముఖ్యంగా విస్తరిస్తున్నాయి.**

### ఆర్థిక వ్యవస్థ :

ప్రవక్త స్వేచ్ఛా విపణి విధానాన్ని ప్రోత్సహించారు. అక్రమ నిల్వలు, దోపిడీ, మోసాలను కట్టడి చేస్తూ సమాన అవకాశాలు ప్రోత్సహించారు. గుత్తాధిపత్యాలకు వ్యతిరేకంగా మార్కెట్లను నియంత్రించడం, చిన్న పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ఆర్థికవ్యవస్థకు ఎంత అవసరమో ఈ విధానాలు చాటి చెబుతున్నాయి.

### ప్రజా సంక్షేమం:

వ్యక్తిగత పరిశుభ్రత నుండి ప్రజా బాధ్యత వరకు పరిశుభ్రతపై ఆయన బోధనలు వ్యర్థాల నిర్వహణ, పారిశుద్ధ్యం, భాగస్వామ్య జవాబుదారీతనం ప్రాముఖ్యతను నొక్కి చెబుతాయి. ఇవి నేటి మెగాసిటీలకు అత్యంత కీలకమైన అంశాలు.

### భూ పంపిణీ:


వలసదారులు (ముహాజిరులు), స్థానికుల (అన్సార్లు) మధ్య న్యాయంగా భూమిని కేటాయించడం ద్వారా ఆయన తన కాలపు శరణార్థుల సంక్షోభాన్ని పరిష్కరించారు. పట్టణ వలసలు, గృహాల కొరతను పరిష్కరించడానికి ఆధునిక నగరాలు ఈ విధానం నుండి నేర్చుకోవచ్చు.

ఆధునిక ప్రపంచాన్ని వేధిస్తున్న అవినీతి, అన్యాయం, అసమానత, పర్యావరణ క్షీణత, ఆకలి, పట్టణాల నిర్వహణలో లోపాల వంటి అనేక సమస్యలకు ప్రవక్త జీవితచరిత్రలో మనకు పరిష్కార మార్గాలు కనిపిస్తాయి. న్యాయం, నిజాయితీ, దయ, సానుభూతి, స్థిరత్వం, నైతిక ప్రమాణాలకు కట్టుబడితే ప్రపంచంలోని అనేక సంక్షోభాలను నివారించవచ్చు. ✤

# ప్రవక్త (స) ఆదర్శాలు

## ఆత్మపరిశీలన, ఆచరణల సమ్మేళనం

యండి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్




రబీఉల్ అవ్వల్ మాసం రాకడ ముస్లింలకు ఒక సాధారణ ఇస్లామీయ మాసం ప్రారంభం మాత్రమే కాదు. అది మానవ చరిత్రలో ఒక మహత్తరమైన పరివర్తనకు గుర్తుగా నిలిచిన పవిత్ర కాలాన్ని గుర్తుచేసే సందర్భం. ఈ మాసంతో ముడిపడి ఉన్న దైవప్రవక్త ముహమ్మద్ (స) జీవితం, ఆయన సందేశం, ఆయన నడవడి, ఆయన చూపిన మానవతా మార్గం – ఇవన్నీ మనిషి తనను తాను సంస్కరించుకోవడానికి, పరిశీలించుకోవడానికి,

తన సమాజ స్థితిని పునఃపరిశీలించుకోవడానికి ఒక గొప్ప అవకాశాన్ని కల్పిస్తాయి. అల్లాహ్ తాను పంపిన మార్గదర్శకత్వం గురించి పవిత్ర ఖురాన్‌లో, 'అల్లాహ్ తరఫున మీ వద్దకు ఒక వెలుగు, స్పష్టమైన గ్రంథం వచ్చాయి' అని పేర్కొన్నాడు. ఈ వెలుగును కేవలం ఒక కాలానికి, ఒక ప్రాంతానికి, ఒక జాతికి పరిమితం చేయలేం. దైవప్రవక్త (స) రాకడతో అజ్ఞానపు చీకట్లలో ఉన్న మానవ సమాజానికి జ్ఞానం, విశ్వాసం, న్యాయం, కరుణ, నైతికతలతో కూడిన ఒక కొత్త దిశ ఏర్పడింది.

### అజ్ఞాన చీకట్ల నుంచి నైతిక పునర్నిర్మాణం వైపు

ఆయన రాకకు ముందు అరేబియా సమాజం అనేక సామాజిక, నైతిక, ఆధ్యాత్మిక సంక్షోభాలతో కొట్టు మిట్టాడుతూ ఉండేది. తెగల మధ్య విభేదాలు, ప్రతీకార భావం, బలవంతుల ఆధిపత్యం, బలహీనుల నిరాదరణ, స్త్రీల పట్ల అన్యాయం, పేదల పట్ల నిర్లక్ష్యం వంటి అనేక సమస్యలు సమాజాన్ని పట్టిపీడించాయి. అలాంటి పరిస్థితుల్లో దైవప్రవక్త (స) ఒక ఆధ్యాత్మిక సందేశహరుడిగానే కాకుండా, సమాజాన్ని నైతికంగా పునర్నిర్మించిన మార్గదర్శిగా నిలిచారు. ఆయన జీవితం ఒక గొప్ప సత్యాన్ని మన ముందుంచుతుంది. సమాజాన్ని మార్చాలంటే ముందుగా మనిషి హృదయం మారాలి. హృదయమనే అంతరంగంలో విశ్వాసం, కరుణ, బాధ్యత, న్యాయబుద్ధి, ఇతరుల పట్ల గౌరవం ఏర్పడినప్పుడు మాత్రమే ఆ మార్పు కుటుంబానికి, అక్కడి నుంచి సమాజానికి, చివరకు సమస్త మానవాళికి విస్తరిస్తుంది.

### సర్వలోకాలకూ కరుణామూర్తి

దైవప్రవక్త (స)ను ఖుర్ఆన్ 'సర్వలోకాలకూ కరుణగా'

పంపబడినవారని పేర్కొంటుంది. ఈ ఒక్క వాక్యంలోనే ఆయన సందేశం విశాలత అంతా ఇమిడి ఉంది. ఆయన సందేశం ఒక వర్గానికో, ఒక జాతికో, ఒక భౌగోళిక ప్రాంతానికో మాత్రమే పరిమితమైనది కాదు. ఆయన బోధనలో మనిషి విలువ అతని వంశం, సంపద, అధికారంతో నిర్ణయించబడదు; విశ్వాసం, నైతికత, మంచితనం, మానవత్వంతో నిర్ణయించబడుతుంది. దైవప్రవక్త (స) జీవితం మొత్తం పరిశీలిస్తే, కరుణ ఆయన వ్యక్తిత్వానికి ప్రధాన లక్షణంగా కనిపిస్తుంది. ఆయనను బాధించిన వారిపట్ల కూడా క్షమాభావాన్ని ప్రదర్శించారు. తనకు అన్యాయం చేసిన వారిపై ప్రతీకారం తీర్చుకునే అవకాశం వచ్చిన సందర్భాల్లో కూడా క్షమను ఎంచుకున్నారు. తన అనుచరులకు కూడా కోపం, ద్వేషం, ప్రతీకారం కంటే సంయమనం, సహనం, దయ, క్షమ అనే విలువలను నేర్పారు.

## నినాదాలు కావు... ప్రవర్తన ముఖ్యం

ఈ రోజు మనం ఈ పవిత్ర మాసాన్ని ఆహ్వానిస్తున్నప్పుడు అసలు మనం ఏం చేస్తున్నామనేది ఆలోచించుకోవాలి. ఒక కాలాన్ని ఆహ్వానిస్తున్నామా? లేక దాంతో మన జీవితాల్లోకి రావాల్సిన దైవప్రవక్త (స) బోధనలను కూడా ఆహ్వానిస్తున్నామా? ఆయన పట్ల ప్రేమను ప్రకటించడం సులభం. ఆయన పేరును గౌరవంగా పలకడం, జన్మదినాన్ని స్మరించుకోవడం కూడా సులభమే. కానీ ఆయన చూపిన మార్గంలో నడవడం మాత్రం అంత సులభం కాదు. ఎందుకంటే ఆయన సున్నత్ మన మాటలకంటే మన ప్రవర్తనను ప్రశ్నిస్తుంది; మన నినాదాలకంటే మన నైతికతను పరీక్షిస్తుంది; మన ఆచారాలకంటే మన హృదయాన్ని పరిశీలిస్తుంది.

దైవప్రవక్త (స) తన అనుచరులకు కేవలం మతపరమైన ఆదేశాలను మాత్రమే బోధించలేదు. జీవితం ఎలా గడపాలి, ఇతరులతో ఎలా ప్రవర్తించాలి, బలహీనుల హక్కులను ఎలా కాపాడాలి, కుటుంబ సభ్యులతో ఎలా వ్యవహరించాలి, పొరుగు వారిని ఎలా గౌరవించాలి, పేదల పట్ల ఎలా బాధ్యత వహించాలి అనే విషయాల్లో కూడా ఆచరణాత్మక మార్గదర్శకత్వం చూపారు. అందుకే ఆయన జీవితం ఒక వ్యక్తిగత ఆధ్యాత్మిక ప్రయాణం మాత్రమే కాదు; అది సంపూర్ణ సామాజిక మార్గదర్శకం. కుటుంబం నుంచి మార్కెట్ వరకు, వ్యక్తిగత ప్రవర్తన నుంచి ప్రజా వ్యవహారాల వరకు, ఆధ్యాత్మికత నుంచి సామాజిక న్యాయం వరకు ఆయన చూపిన మార్గం విస్తరించింది.

## ఆరాధన, మానవ సంబంధాల పవిత్రత

పవిత్ర ఖురాన్ ముస్లిం సమాజాన్ని 'ప్రజల మేలు కోసం ఉద్భవించిన ఉత్తమ సమాజం'గా పేర్కొంటూ, మంచిని ఆదేశించడం, చెడునునిరోధించడం, అల్లాహ్‌పై విశ్వాసం కలిగి ఉండడం వంటి బాధ్యతలను గుర్తుచేస్తుంది. ఈ బాధ్యత కేవలం ఇతరులకు బోధించడంలో లేదు. ముందుగా మన జీవితాల్లో ఆ విలువలు కనిపించాలి. మన ప్రవర్తనలో నిజాయితీ లేకపోతే విశ్వాసం గురించి మాట్లాడటం అసంపూర్ణం. మన హృదయంలో ద్వేషం నిండిపోయి ఉంటే కరుణ గురించి చెప్పడం అర్థరహితం. మన చుట్టూ ఉన్న పేదవాడి బాధను పట్టించుకోకుండా మతపరమైన కార్యక్రమాల్లో పాల్గొనడం ఆధ్యాత్మికతకు సంపూర్ణ రూపం కాదు. ఎందుకంటే దైవప్రవక్త (స) బోధనలో ఆరాధనతో పాటు మానవ సంబంధాల పవిత్రతకు కూడా అంతే ప్రాధాన్యం ఉంది.

## సమతాభావం, సామాజిక న్యాయం

ఆయన జీవితం మనకు నేర్పిన మరో ముఖ్యమైన విషయం సోదరభావం. ఇస్లాం మనుషుల మధ్య ఉన్న కృత్రిమమైన ఉన్నత – నీచ భేదాలను చెరిపివేయడానికి ప్రయత్నించింది. సంపద, వంశం, భాష, ప్రాంతం వంటి భేదాలను మించి మానవ గౌరవాన్ని నిలబెట్టింది. ఒక మనిషి మరొక మనిషిని తక్కువగా చూడకూడదనే నైతికతను బలంగా ప్రతిష్ఠించింది. దైవప్రవక్త (స) సమాజ నిర్మాణంలో పేదలు, అనాథలు, బలహీనులు, నిరాశ్రయులు, అణగారినవారు కూడా సమాన గౌరవానికి అర్హులని ఆచరణలో చూపించారు. సమాజంలో బలహీనుడి హక్కు కాపాడబడినప్పుడే ఆ సమాజం నిజమైన న్యాయ సమాజంగా నిలుస్తుంది. బలవంతుడికి మాత్రమే న్యాయం లభించే చోట నాగరికత ఉన్నట్లు కనిపించినా, దాని అంతరంగంలో అన్యాయమే ఉంటుంది.

## ఆదర్శ జీవితం: మానవతా విలువల నైతిక దర్పణం

ఈ నేపథ్యంలో ఈ పవిత్ర సమయం ఆత్మపరిశీలనకు ఒక మంచి అవకాశం. మనం దైవప్రవక్త (స)ను ఎంతగానో ప్రేమిస్తున్నామని చెప్పుకోవడం కంటే, ఆయన ఆచరించి, నేర్పించిన విలువలను మన జీవితాల్లో ఎంతవరకు నిలబెట్టామన్నదే అసలు ప్రశ్న. ఆయన సత్యాన్ని ప్రేమించారు, మనం సత్యాన్ని ఎంతగా ప్రేమిస్తున్నాం? ఆయన కరుణను ఆచరించారు, మన చుట్టూ బాధపడుతున్న మనిషిని చూసినప్పుడు మన హృదయం ఎంతగా స్పందిస్తోంది? ఆయన క్షమించారు, మనల్ని బాధించిన వ్యక్తిని క్షమించగలిగే స్థితిలో మనం ఉన్నామా? ఆయన బలహీనుల హక్కులను కాపాడారు, మనకు అందుబాటులో ఉన్న చిన్న అవకాశాల్లోనైనా బలహీనుడికి అండగా నిలుస్తున్నామా? ఆయన

మాటకు, చేతలకు, ఆచరణకు మధ్య ఎలాంటి వైరుధ్యం లేదు– మన మాటలు, విశ్వాసాలు, ప్రవర్తన మధ్య అదే సమన్వయం ఉందా? ఇవి మన ముందుండే అసలు ప్రశ్నలు.

నేడు ప్రపంచం విజ్ఞానపరంగా ఎంతో ముందుకు వెళ్లింది. సాంకేతికత మనిషి చేతిలో అపూర్వమైన శక్తిని ఉంచింది. సమాచారాన్ని క్షణాల్లో ప్రపంచం నలుమూలలకు పంపగలుగుతున్నాం. కానీ ఈ పురోగతితో పాటు మానవ సంబంధాల్లో దూరం, అసహనం, ద్వేషం, హింస, స్వార్థం కూడా పెరుగుతున్నాయి. మనిషి ప్రకృతిపై ఆధిపత్యం సాధించినా, తన కోపంపై, లోభంపై, అహంకారంపై ఇంకా పూర్తిగా విజయం సాధించలేకపోతున్నాడు. ఇటువంటి పరిస్థితుల్లో దైవప్రవక్త (స) జీవితం మరింత ప్రాసంగికమవుతుంది. ఎందుకంటే ఆయన చూపిన మార్గం మనిషిని కేవలం బాహ్య ప్రపంచాన్ని జయించ మని చెప్పదు; ముందుగా తన అంతరంగాన్ని జయించమని చెబుతుంది.

ఆయన బోధనలో సంపదను తిరస్కరించడం లేదు; సంపదకు బానిస కావద్దని చెబుతుంది. అధికారాన్ని తిరస్కరించడం లేదు; అధికారాన్ని అన్యాయానికి ఉపయోగించవద్దని చెబుతుంది. బలాన్ని నిరాకరించడం లేదు; బలాన్ని బలహీనులపై ప్రయోగించవద్దని నేర్పుతుంది. జ్ఞానాన్ని గొప్పగా చూస్తుంది; కానీ జ్ఞానంతో పాటు వినయాన్ని కూడా కోరుతుంది. ఇదే ఆయన సందేశంలోని విశిష్టత. అది జీవితాన్ని విడిచిపెట్టి ఆధ్యాత్మికతను వెతకమని చెప్పదు; జీవితాన్ని సరిదిద్దుతూ ఆధ్యాత్మికతను ఆచరించమని చెబుతుంది.

## ఉత్సవం నుండి ఆచరణాత్మక సంస్కరణ వైపు

ఈ పవిత్ర మాసం వచ్చిందంటే మన ఇళ్లలో, మసీదుల్లో, సమాజంలో దైవప్రవక్త (స) స్మరణ పెరగడం సహజం. కానీ ఆ స్మరణ మన ప్రవర్తనలో మార్పుకు దారి తీసినప్పుడే దాని అసలు ప్రయోజనం నెరవేరుతుంది. మన ఇళ్లలో ప్రేమ పెరగాలి. కుటుంబాల్లో పరస్పర గౌరవం, పొరుగువారి పట్ల బాధ్యత పెరగాలి. పేదల పట్ల మనసు కదలాలి. అన్యాయాన్ని చూసి మౌనం వహించే స్వభావం తగ్గాలి. ద్వేషం స్థానంలో సోదరభావం, ప్రతీకారం స్థానంలో క్షమ, స్వార్థం స్థానంలో సేవాభావం పెరగాలి. దైవప్రవక్త (స) పట్ల నిజమైన ప్రేమ అంటే ఆయన పేరును మాత్రమే ప్రేమించడం కాదు; ఆయన నడిచిన మార్గాన్ని ప్రేమించడం, ఆయన చెప్పిన సత్యాన్ని జీవితంలో ఆచరించడం, ఆయన చూపిన కరుణను మన చుట్టూ పంచడం, ఆయన స్థాపించిన న్యాయాన్ని మన వ్యవహారాల్లో నిలబెట్టడం.

ఆయన జీవితం గురించి అధ్యయనం చేయడం కేవలం చరిత్రను తెలుసుకోవడం కాదు. అది మనల్ని మనం తెలుసుకోవడానికి కూడా ఒక మార్గం. ఎందుకంటే సీరత్ మనిషికి తన లోపాలను చూపించే అద్దం. ఆ అద్దంలో మన ప్రవర్తనను చూసుకున్నప్పుడు మనలో ఎక్కడ అహంకారం ఉందో, ఎక్కడ అసహనం ఉందో, ఎక్కడ స్వార్థం ఉందో, ఎక్కడ ఇతరుల పట్ల నిర్లక్ష్యం ఉందో తెలుస్తుంది. అందుకే ఇది మనకు కేవలం ఉత్సవ సందేశం కాకుండా సంస్కరణ సందేశాన్ని అందించాలి. ఈ మాసం మన జీవితాల్లో కొత్త నైతిక చైతన్యానికి ఆరంభం కావాలి. దైవప్రవక్త (స) పట్ల మన ప్రేమ మాటల నుంచి ఆచరణకు ప్రయాణించాలి.

## కారుణ్య మాసపు నిజమైన ఆవశ్యకత

పవిత్ర ఖురాన్ దైవప్రవక్త (స)ను 'నిశ్చయంగా మీ వద్దకు మీలో నుంచే ఒక ప్రవక్త వచ్చారు. మీరు కష్టపడటం ఆయనకు ఎంతో బాధ కలిగిస్తుంది. ఆయన మీ మేలును కోరుకునేవారు, విశ్వాసుల పట్ల ఎంతో దయగలవారు, కరుణామయులు' (సూరా తౌబా 9:128) అని వర్ణిస్తుంది. ఈ వర్ణనలోనే ఆయన వ్యక్తిత్వ సారాంశం కనిపిస్తుంది. మానవుల బాధ ఆయనకు బాధ, వారి మేలు ఆయన ఆకాంక్ష. వారి హృదయాలను కలపడం ఆయన లక్ష్యం. వారి జీవితాల్లో న్యాయం, దయ, విశ్వాసం, నైతికతలను నెలకొల్పడం ఆయన కృషి.

కాబట్టి ఈ రబీఉల్ అవ్వల్‌లో మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. దైవప్రవక్త (స) సందేశం మన జీవితాల్లో ఎంతవరకు ప్రవేశించింది? మన కుటుంబంలో, మన పొరుగువారితో, మన సమాజంలో, మన మాటల్లో, మన లావాదేవీల్లో ఆయన బోధన ఎంతవరకు ప్రతిఫలిస్తోంది? ఈ ఆగమనానికి నిజమైన స్వాగతం అదే. మన హృదయాల్లో కరుణ వెలగాలి, మన మాటల్లో సత్యం నిలవాలి, మన చేతుల్లో సేవ ఉండాలి, మన ప్రవర్తనలో న్యాయం కనిపించాలి, మన సంబంధాల్లో ప్రేమ పెరగాలి, మన సమాజంలో సోదరభావం బలపడాలి.

దైవప్రవక్త (స) జీవితం మనకు అందించిన ఈ మహత్తరమైన సందేశాన్ని మన జీవితాల్లో ఆచరణలోకి తీసుకురాగలిగితేనే రబీఉల్ అవ్వల్ మనకు నిజమైన కారుణ్య మాసంగా, మార్పు మాసంగా, మానవత్వాన్ని మేల్కొలిపే మాసంగా నిలుస్తుంది. ఎందుకంటే ప్రవక్తను స్మరించుకోవడంతో బాధ్యత తీరిపోదు, ఆయన చూపిన మార్గంలో నడవగలగాలి. ఆయనపై ప్రేమను ప్రకటించడం ఒక భావోద్వేగం మాత్రమే కాదు; ఆయన ఆదర్శాలను జీవితంలో ప్రతిబింబించడం ఆ ప్రేమకు అసలైన సాక్ష్యం.

✤



# ముహమ్మద్ ప్రవక్త (స): మానవాళి విమోచకుడు సమాజ పునర్నిర్మాత

**యం డి. ఫారూఖ్ జునైద్ ఖాన్**

**మానవ చరిత్రలో** ఏడవ శతాబ్దపు అరేబియా ఒక అత్యంత అంధకార పూరితమైన కాలం. అది అన్యాయం, అజ్ఞానం, జాతి వివక్ష, స్త్రీలపై దౌర్జన్యాలు, బలవంతుల అణచివేతలతో కూరుకుపోయిన చీకటి యుగం. మానవత్వానికి ఏమాత్రం విలువ లేని ఆ రోజుల్లో, బలహీనుల ఆర్తనాదాలు అరణ్యరోదన గానే మిగిలిపోయేవి. ఆడపిల్ల పుట్టడమే ఒక పెద్ద అపరాధంగా, శాపంగా భావించి ఆమెను ప్రాణాలతోనే మట్టిలో పాతిపెట్టే కిరాతక సంస్కృతి రాజ్యమేలేది. సమాజంలో సమానత్వం, మానవ హక్కులు అనే ప్రాథమిక భావనలకు సైతం స్థానం లేని ఆ కఠిన పరిస్థితుల్లో, ముహమ్మద్ ప్రవక్త (స) ఒక వెలుగుగా, మానవాళి విమోచకుడిగా లోకంలోకి వచ్చారు. ఆయన రాకతో అరేబియా ద్వీపకల్పంలోనే కాక, విశ్వవ్యాప్తంగా ఒక నూతన మానవతా శకం ఆరంభమైంది.

## సామాజిక విప్లవం, సమానత్వ స్థాపన

ముహమ్మద్ ప్రవక్త (స) తెచ్చిన మార్పు కేవలం మతపరమైన పరిమితులకు మాత్రమే పరిమితం కాలేదు. అది సామాజిక, రాజకీయ, ఆర్థిక, ఆధ్యాత్మిక రంగాలన్నింటినీ ప్రభావితం చేసిన ఒక సమగ్ర విప్లవం. మానవులందరూ ఒక్కటేనని, దేవుని దృష్టిలో అందరూ సమానులేనని ఆయన చాటి చెప్పారు. అరబ్బుకు అరబ్బేతరునిపై గానీ, తెల్లవానికి నల్లవానిపై గానీ ఎటువంటి ప్రాధాన్యత లేదని, కేవలం నైతికత, దైవభీతి మాత్రమే మనుషుల శ్రేష్ఠతకు కొలమానాలని స్పష్టం చేశారు. ఈ మహోన్నత బోధన ద్వారా శతాబ్దాలుగా వేరూనుకుపోయిన జాతి, వర్ణ, వర్గ వైషమ్యాలను ఆయన వేళ్లతో సహా పెకలించి వేశారు. బానిసత్వాన్ని అంతం చేసే దిశగా చారిత్రాత్మకమైన చర్యలు చేపట్టి, బానిసలను తమ సొంత సోదరులుగా చూడాలని,

వారిని విముక్తులను చేయడం అత్యంత పుణ్యకార్యమని బోధించి సమాజంలో సరికొత్త సమతాభావాన్ని నింపారు.

## స్త్రీ హక్కుల పునరుద్ధరణ, కుటుంబ విలువలు

స్త్రీల పట్ల ప్రవక్త (స) చూపిన గౌరవం, కల్పించిన హక్కులు అప్పట్లో ఒక అపూర్వ విప్లవానికి నాంది పలికాయి. మహిళను కేవలం భోగవస్తువుగా చూసే సమాజంలో ఆమెకు ఆస్తి హక్కు, వివాహ ఎంపిక హక్కు, విడాకుల హక్కు, గౌరవప్రదంగా జీవించే హక్కును అందించారు. 'తల్లి పాదాల కిందనే స్వర్గం ఉంది' అని ప్రకటించడం ద్వారా సమాజంలో స్త్రీ స్థానాన్ని అత్యున్నత శిఖరానికి చేర్చారు. ఆడపిల్ల జననాన్ని శాపంగా కాకుండా, దైవ ఆశీర్వాదంగా స్వీకరించాలని బోధించారు. భార్యగా, తల్లిగా, కుమార్తెగా, సోదరిగా ప్రతి రూపంలోనూ మహిళకు సమాజంలో తగిన రక్షణ, ప్రాధాన్యత, న్యాయమైన హక్కులు లభించేలా చట్టబద్ధమైన, నైతికపరమైన నియమాలను ఏర్పాటు చేశారు.

## మదీనా రాజ్యాంగం: ప్రజాస్వామ్యానికి తొలి అడుగు

ముహమ్మద్ ప్రవక్త (స) కేవలం ఒక ఆధ్యాత్మిక మార్గదర్శి మాత్రమే కాదు, ఒక అద్భుతమైన సమాజ నిర్మాత, దార్శనిక పాలకుడు. ఆయన మదీనాకు వలస వచ్చిన తర్వాత అక్కడ రూపొందించిన 'సహీఫతుల్ మదీనా' (మదీనా రాజ్యాంగం) మానవ చరిత్రలోనే మొట్టమొదటి లిఖితబద్ధమైన సామాజిక ఒప్పందంగా నిలిచింది. భిన్న తెగలు, ముస్లింలు, యూదులు, ఇతర మతస్థులందరినీ ఒకే వేదికపైకి తెచ్చి, అందరికీ సమాన పౌర హక్కులు, మత స్వేచ్ఛను ఈ రాజ్యాంగం ద్వారా ఖరారు చేశారు. పరస్పర సహకారం, సామరస్యం, కలిసికట్టుగా మాతృభూమిని రక్షించుకోవడం ఇందులో ప్రధానాంశాలు. ఆధునిక లౌకిక, ప్రజాస్వామ్య భావనలకు, పౌర హక్కుల పత్రాలకు ఈ మదీనా రాజ్యాంగమే అసలైన పునాదిగా నిలిచింది.

## ఆర్థిక న్యాయం, దోపిడీ రహిత వ్యవస్థ

సమాజంలో ఆర్థిక అసమానతలను తొలగించి, సంపద కొద్ది మంది చేతుల్లోనే కేంద్రీకృతం కాకుండా చూడటానికి ప్రవక్త (స) ఒక సమగ్రమైన ఆర్థిక నమూనాను అందించారు. పేదలను, బలహీనులను పీల్చి పిప్పిచేసే వడ్డీ (రిబా) రహిత వ్యవస్థను అమలులోకి తెచ్చారు. జకాత్, సదఖా వంటి దానధర్మాల వ్యవస్థల ద్వారా ధనవంతుల సంపద నుండి పేదలకు న్యాయమైన వాటా అందేలా చూశారు. ధనం అనేది కేవలం వ్యాపార వర్గాల మధ్య మాత్రమే పరిభ్రమించకుండా, సమాజంలోని అత్యంత దిగువ స్థాయిలో ఉన్న పేదవాడికి కూడా ఆసరాగా నిలవాలనే ఆర్థిక సత్యాన్ని ఆచరణలో చూపించారు. ఇది నేటికీ ప్రపంచానికి కావలసిన అత్యుత్తమ ఆర్థిక సంక్షేమ నమూనా.

## శాంతి, సహనం, చివరి హజ్ ప్రసంగం

హింస, యుద్ధాల కంటే శాంతి, సంప్రదింపులు, క్షమాగుణానికే ప్రవక్త (స) ఎల్లప్పుడూ ప్రథమ ప్రాధాన్యత ఇచ్చారు. శత్రువులను సైతం క్షమించి మనస్సులను గెలుచుకోవడమే నిజమైన విజయమని ఆయన తన జీవితాంతం నిరూపించారు. ఆయన చేసిన చివరి హజ్ ప్రసంగం (విదా ఖుత్బా) మానవ హక్కుల చరిత్రలోనే ఒక మైలురాయిగా నిలిచింది. మానవుల ప్రాణాలు, ఆస్తులు, గౌరవ మర్యాదలు పవిత్రమైనవని, వాటిని భంగపరచే హక్కు ఎవరికీ లేదని ఆ ప్రసంగంలో స్పష్టం చేశారు. నేటి ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల ప్రకటనకు శతాబ్దాల ముందే ప్రవక్త (స) మానవాళికి ఈతొలి విశ్వజనీన హక్కుల చార్టర్‌ను అందజేశారు.

## ఆధునిక సమాజానికి ప్రవక్త బోధనల ఆవశ్యకత

నేటి ఆధునిక యుగంలో కూడా ప్రపంచం మళ్లీ నూతన రూపాల్లో అన్యాయం, అసమానతలు, ద్వేషం, వర్గ పోరాటాలు, యుద్ధాలతో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. సాంకేతికంగా మానవుడు ఎంతో ప్రగతి సాధించినప్పటికీ, మానవీయ విలువల విషయంలో తీవ్రంగా వెనుకబడిపోతున్నాడు. అధికారం, ధనం, వర్ణం, లింగం పేరిట విభజనలు రోజురోజుకూ పెరుగుతున్న ఈ కాలంలో ముహమ్మద్ ప్రవక్త (స) బోధనలు మునుపటి కంటే అత్యంత ప్రాసంగికంగా మారాయి.

మీలాదున్నబీ సందర్భం అనేది కేవలం ఉత్సవాలు, ఊరేగింపులకే పరిమితం కాకూడదు. ప్రవక్త (స) చూపిన శాంతి, దయ, సమానత్వం, న్యాయమనే మార్గంలో నడవడమే ఆయన పట్ల మనం ప్రకటించే నిజమైన ప్రేమాభిమానాలకు నిదర్శనం. సమాజంలో బలహీనులకు అండగా నిలవడం, స్త్రీలను గౌరవించడం, ఆర్థిక శోషణను నిరసించడం, భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించడం ద్వారా మాత్రమే మనం ఒక సమతా పూరితమైన, శాంతియుతమైన నవ సమాజాన్ని నిర్మించగలము.

★ ★ ★




**ముహమ్మద్ అజీజుద్దీన్**

నేటి ప్రపంచం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఎంతో అభివృద్ధి చెందుతోంది. చేతిలోని మొబైల్ ద్వారా ప్రపంచం మన గదిలోకి వచ్చినా, మనుషులు మాత్రం ఒకరికొకరు దూరమవుతున్నారు. ఒకే ఇంట్లో ఉంటూ మాట్లాడుకోలేని పరిస్థితి, ఆస్తి కోసం అన్నదమ్ముల మధ్య శత్రుత్వం, తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యం, వివాహ బంధాల్లో విశ్వాసం తగ్గడం, పిల్లల పెంపకంలో నైతిక విలువలు బలహీనపడటం వంటి పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇలాంటి సమయంలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) చూపించిన జీవన విధానం నేటి సమాజానికి ఎంతో అవసరం.

## తల్లిదండ్రులు -- ఆస్తి కంటే అమూల్యమైనవారు

తల్లిదండ్రులు తమ జీవితాన్ని పిల్లల భవిష్యత్తు కోసం త్యాగం చేస్తారు. కానీ వృద్ధాప్యంలో వారినే భారంగా చూడటం, ఆస్తి కోసం ఒత్తిడి చేయడం, చివరకు హింసకు పాల్పడటం మానవత్వానికే మచ్చ. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తల్లిదండ్రుల స్థానాన్ని ఎంతో ఉన్నతంగా చూపించారు.

ఒక వ్యక్తి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ను “నా మంచి సాంగత్యానికి అత్యంత అర్హుడు ఎవరు?” అని అడిగాడు. ప్రవక్త “నీ తల్లి” అన్నారు. మళ్లీ అడిగినా “నీ తల్లి”, మూడోసారి కూడా “నీ తల్లి”, నాలుగోసారి “నీ తండ్రి” అన్నారు. (సహీహ్ బుఖారీ: 5971)

ఈ హదీసు తల్లిదండ్రుల పట్ల మన బాధ్యతను స్పష్టంగా తెలియజేస్తుంది. ఆస్తి కోసం తల్లిదండ్రులను కోల్పోవడం అంటే తాత్కాలిక సంపద కోసం జీవితంలోని శాశ్వతమైన అనుబంధాన్ని కోల్పోవడమే. ఆస్తి వివాదాలు, అహంకారం, అపార్థాల కారణంగా అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు, బంధువులు సంవత్సరాల తరబడి మాట్లాడుకోకుండా ఉండటం నేడు సాధారణమవుతోంది. కానీ ఇస్లాం బంధుత్వాన్ని తెంచుకోవడాన్ని తీవ్రంగా హెచ్చరించింది.

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) “బంధుత్వాన్ని తెంచేవాడు స్వర్గంలో ప్రవేశించడు” అని హెచ్చరించారు. (సహీహ్ ముస్లిం: 2556)

అందుకే కొన్ని గజాల భూమి కోసం రక్తసంబంధాన్ని తెంచుకోవడం ఎంతటి నష్టమో ఆలోచించాలి. డబ్బు తిరిగి సంపాదించవచ్చు కానీ కోల్పోయిన బంధాన్ని, కోల్పోయిన మనిషిని తిరిగి పొందడం సాధ్యం కాదు.

## అక్రమ సంబంధాలు - క్షణిక ఆకర్షణ, జీవితాంతం బాధ

నేటి కుటుంబ వ్యవస్థను బలహీనపరుస్తున్న మరో తీవ్రమైన సమస్య వివాహ బంధానికి వెలుపల ఏర్పడే అక్రమ సంబంధాలు. సోషల్ మీడియా, రహస్య చాటింగ్, అనుచిత పరిచయాలు, అశ్లీల కంటెంట్ వంటి వాటి ద్వారా కొందరు నైతిక హద్దులను క్రమంగా దాటుతున్నారు.

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ ప్రమాదాన్ని చాలా ముందుగానే హెచ్చరించారు. సహీహ్ ముస్లిం హదీసులో: "కళ్ల జినా – అనుచితంగా చూడటం, చెవుల జినా –వినడం, నాలుక జినా– అనైతికంగా మాట్లాడటం, చేతులు–కాళ్లు పాపానికి దారితీసే పనుల్లో పాలుపంచుకోవడం" అని వివరించారు. (సహీహ్ ముస్లిం: 2658)

అంటే పెద్ద తప్పు ఒక్కసారిగా ప్రారంభం కాదు. ఒక చూపు, ఒక మాట, ఒక రహస్య పరిచయం, ఒక చాటింగ్... ఇలా చిన్న అడుగులు చివరకు కుటుంబాన్ని నాశనం చేసే స్థాయికి తీసుకెళ్లవచ్చు. అందుకే కళ్లను, మాటలను, స్నేహాలను, డిజిటల్ పరిచయాలను నియంత్రించాలి.

భార్యాభర్తల మధ్య ప్రేమ, గౌరవం, విశ్వాసం పెరగాలి. సమస్య వచ్చినప్పుడు బయట పరిచయాల కోసం కాకుండా ఒకరితో ఒకరు మాట్లాడుకుని పరిష్కరించుకోవాలి. కుటుంబంలో ఆత్మీయత బలంగా ఉంటే బయటి ఆకర్షణల ప్రభావం తగ్గుతుంది.

## పిల్లల పెంపకం - తల్లిదండ్రుల గొప్ప బాధ్యత

సమాజ భవిష్యత్తు పిల్లల చేతుల్లో ఉంది. వారికి మంచి పాఠశాల, ఖరీదైన దుస్తులు, మొబైల్ ఇవ్వడం మాత్రమే తల్లిదండ్రుల బాధ్యత కాదు. నిజాయితీ, క్రమశిక్షణ, నమాజు, తల్లిదండ్రుల పట్ల గౌరవం, బంధుత్వం, దయ, ఇతరుల హక్కులను గౌరవించడం వంటి విలువలను నేర్పడమే అసలైన పెంపకం.

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అన్నారు:

"మీలో ప్రతి ఒక్కరూ సంరక్షకులే, తన సంరక్షణలో ఉన్నవారి గురించి ప్రతి ఒక్కరూ ప్రశ్నించబడతారు."

*(సహీహ్ బుఖారీ: 7138)*

ఈ హదీసు తల్లిదండ్రులకు ఒక గొప్ప బాధ్యతను గుర్తుచేస్తుంది. పిల్లలు ఏమి చూస్తున్నారు? ఎవరితో స్నేహం చేస్తున్నారు? మొబైల్‌లో ఏమి చూస్తున్నారు? వారి మనసులో ఏ సమస్యలు ఉన్నాయి? అనే విషయాలను ప్రేమతో తెలుసుకోవాలి.

పిల్లలను కేవలం భయపెట్టి పెంచడం కాదు; వారితో మాట్లాడాలి, వారి మాట వినాలి, తప్పు చేసినప్పుడు ఎందుకు తప్పో అర్థమయ్యేలా చెప్పాలి. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ ప్రవర్తన ద్వారా పిల్లలకు ఆదర్శంగా నిలవాలి. ఎందుకంటే పిల్లలు మనం చెప్పిన మాటల కంటే మనం ఆచరించే జీవితాన్ని ఎక్కువగా అనుసరిస్తారు.

## సంపద కంటే విలువైన వారసత్వం

పిల్లలకు ఇల్లు, భూమి, డబ్బు ఇవ్వడం కంటే మంచి నడవడి, దైవభీతి, నిజాయితీ, కుటుంబ ప్రేమ, బాధ్యత వంటి విలువలను వారసత్వంగా ఇవ్వడం గొప్పది. ఆస్తి కోసం బంధాన్ని కోల్పోకూడదని, క్షణిక ఆకర్షణ కోసం కుటుంబాన్ని నాశనం చేయకూడదని, తల్లిదండ్రుల వృద్ధాప్యాన్ని భారంగా కాకుండా బాధ్యతగా చూడాలని పిల్లలకు నేర్పాలి.

మంచి కుటుంబమే మంచి సమాజానికి పునాది. ఇంట్లో తల్లిదండ్రుల పట్ల గౌరవం ఉంటే పిల్లలు గౌరవం నేర్చుకుంటారు. భార్యాభర్తల మధ్య విశ్వాసం ఉంటే పిల్లలు కుటుంబ విలువలను నేర్చుకుంటారు. బంధువులతో ప్రేమగా ఉంటే పిల్లలు బంధుత్వాన్ని కాపాడటం నేర్చుకుంటారు.

ఆస్తి కోసం తల్లిదండ్రులను కోల్పోవద్దు.

క్షణిక ఆకర్షణ కోసం జీవిత భాగస్వామిని కోల్పోవద్దు.

అహంకారం కోసం బంధువులను దూరం చేయవద్దు.

పిల్లలకు సంపదతో పాటు సత్ప్రవర్తనను కూడా వారసత్వంగా ఇవ్వాలి.

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) చూపించిన మార్గం మనకు ఇదే నేర్పుతుంది: తల్లిదండ్రులను గౌరవించండి, బంధాలను కలుపుకోండి, కుటుంబాన్ని కాపాడండి, నైతిక హద్దులను గౌరవించండి, పిల్లలను బాధ్యతతో పెంచండి.

ఇల్లు పెద్దదిగా ఉండటం కంటే ఆ ఇంట్లో హృదయాలు పెద్దవిగా ఉండాలి. ఆస్తి ఎక్కువగా ఉండటం కంటే బంధాలు బలంగా ఉండాలి. పిల్లలు చదువులో మాత్రమే కాదు, నడవడిలో కూడా ముందుండాలి. అదే ప్రవక్త చూపించిన మార్గం, అదే నేటి సమాజానికి అత్యంత అవసరమైన మార్గదర్శకం. ✤



# దైవప్రవక్త(స) గారి నమాజ్

\- నసీరా బేగం

**ఓ విశ్వాసుల తల్లి ఆయిషా(ర)** మీరు దైవప్రవక్త(స) గారిలో చూసిన ఒక ప్రత్యేక విషయాన్ని నాకు తెలియపరచండి' అని దైవప్రవక్త(స) ప్రత్యక్ష అనుచరుడొకరు విన్నవించుకున్నారు. దానికి సమాధానంగా హజ్రత్ ఆయిషా(ర) ఇలా సెలవిచ్చారు : ఆయన (స) గారి ప్రతి విషయమూ ప్రత్యేకంగానే ఉండేది. నేను మీకు ఏ ఏ విషయాలను గురించి తెలియపరచగలను? ఒకసారి దైవ ప్రవక్త(స) నా గదిలో నిదురపోయారు. రాత్రి సమయం కొంత గడిచిపోయింది. అకస్మాత్తుగా లేచి నిలబడ్డారు. బయటికి వెళ్ళి పోయారు. నా మనసులో పలు ఆలోచనలు రాసాగాయి. ఈ రోజు ఆయన(స) నా దగ్గర ఉండవలసింది కాని ఎక్కడకు వెళు తున్నారు అని నేను ఆయన(స) గారిని అనుసరించాను. దైవ ప్రవక్త(స) మసీదులోకి ప్రవేశించారు. నమాజు చెయ్యటం కోసం నిలబడ్డారు. ఒక యజమాని ముందు ఒక బానిస చేతులు కట్టుకుని నిలబడినట్లుగా ఎంతో వినయ వినమ్రతతో నిలబడి ఉన్నారు. కళ్ళ వెంట కన్నీళ్లు ధారాప్రవాహంగా ప్రవహించసాగాయి. వెక్కిళ్లు రాగాసాయి; పవిత్ర గడ్డం తడిసి ముద్దయిపోయింది. రుకూ చేశారు. రుకూలో కూడా ఏడుస్తూనే ఉన్నారు. సజ్దా చేశారు. సజ్దాలో కూడా విలపిస్తూనే ఉన్నారు. రాత్రంతా ఇలానే గడిచి పోయింది. చివరకు నక్షత్రాలు కనుమరుగైపోయాయి. హజ్రత్ బిలాల్(ర) గారు వచ్చి ఫజర్ నమాజ్ కోసం అజాన్ ఇచ్చారు. నమాజ్ ముగించుకుని దైవప్రవక్త(స) ఇంటిలోకి వచ్చినప్పుడు నేను చూశాను. ఆయన(స)గారి పవిత్ర పాదాలు ఉబ్బిపోయి ఉన్నాయి. బొటనవ్రేలు చిట్లిపోయి ఉంది. దైవప్రవక్త(స) గారి ఈ పరిస్థితి చూసి నేను చలించిపోయాను. ఇలా విన్నవించు కున్నాను: ఓ దైవప్రవక్తా(స)! అల్లాహ్ మిమ్మల్ని రక్షించుగాక! మీరు ఎందుకు ఇంత కష్టపెట్టుకుంటున్నారు. అల్లాహ్ మీ పూర్వపు పాపాలను, మున్ముందు పాపాలను క్షమించివేశాడు కదా! దానికి దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు : 'ఓ ఆయిషా(ర)! అల్లాహ్ నాపై అసంఖ్యాకమైన కారుణ్యాలను వర్షింపజేశాడు కదా. నేను దానిపట్ల అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకోవద్దా. (బుఖారీ)

కారుణ్యమూర్తి ముహమ్మద్(స) గారు నమాజ్ చేసే విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించేవారు. వాస్తవానికి ఆయన(స) పగలు సందేశ ప్రచార కార్యక్రమంలో తలమునకలై ఉండేవారు. ఇంకా అవిశ్వా సులు ఆయనను రకరకాలుగా హింసించే వారు. ఆయన(స) గారి మనసును, ఆయన(స) గారి శరీరాన్ని గాయపరిచే వారు. ఈ పరిస్థితిలో మనిషి సాధారణంగా రాత్రి సమయంలో విశ్రాంతి తీసుకోవటం సహజం. కాని ఆయన(స) విశ్రాంతి తీసుకునే బదులుగా నమాజు చెయ్యటంలో లీనమయ్యేవారు. అంతేకాదు పగలు కూడా విధిగా చెయ్యబడిన నమాజులతోపాటు చాష్త్, ఇష్రాఖ్, అవ్వాబిన్ లాంటి నఫిల్ నమాజులను కూడా క్రమం తప్పకుండా చేసేవారు. నమాజును ఆయన(స) తన కంటి చలువ అని కూడా సెలవిచ్చారు.

దైవప్రవక్త(స) ఇంటిలో ఉన్నా, మస్జిద్‌లో ఉన్నా, ప్రయాణంలో ఉన్నా లేక పట్టణంలో ఉన్నా, బాధలో ఉన్నా, సంతోషంలో

ఉన్నా, శుభవార్త విన్నా, అశుభవార్త విన్నా చివరకు యుద్ధ మైదానంలో ఘోరమైన పోరాటం జరుగుతూ ఉన్నా నమాజు చేస్తూనే ఉండేవారు. అంతేకాదు, ఆయన(స) గారు ఆ నమాజును తన జీవితంలోని చివరి నమాజుగా చేసేవారు. ఆయన(స) గారు నమాజులో నిలబడితే ప్రాణంలేని వృక్షం నిలబడినట్లుగా నిలబడే వారు. రుకూ చేస్తే పొడవాటి రుకూ చేసేవారు, సజ్దా చేస్తే ఇక శిరస్సు పైకి లేపలేమోనన్నంత ఎక్కువసేపు సజ్దా చేసేవారు.

ఒకసారి హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మసూద్(ర) ఇలా సెలవిచ్చారు: నేను ఒకరోజు రాత్రి దైవప్రవక్త(స) గారితోపాటు నమాజ్ చెయ్యటానికి నిలబడ్డాను. ఆయన(స) చాలాసేపు నమాజులో నిలబడే ఉన్నారు. నేను ఆయన(స) గారితోపాటు నిలబడలేక పోయాను. నాకు మధ్యలో ఒక చెడు ఆలోచన వచ్చింది. ఏమని చెడు ఆలోచన వచ్చింది అని ఎవరో అడిగారు. దానికి నేను నమాజులో దైవప్రవక్త(స)ను వదిలేసి నేను కూర్చుండిపోవాలనే ఆలోచన వచ్చింది. (బుఖారీ)

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడని దైవప్రవక్త(స) తెలిపారు. నా దాసుడు నఫిల్ నమాజుల ద్వారా నా సాన్నిహిత్యాన్ని పొందే విషయంలో వృద్ధి చెందుతూ ఉంటే నేను అతన్ని ప్రేమిస్తాను. నేను అతన్ని ప్రేమించినట్లయితే నేను అతను వినే చెవులైపోతాను. అతను చూసే కళ్లై పోతాను. అతను పనిచేసే చేతులైపోతాను. అతను నడిచే పాదాలైపోతాను. అతను కోరినది తప్పకుండా ప్రసాదిస్తాను అంతే కాదు, దైవదూతలు సైతం అతనితో కరచాలనం చేస్తారు. (బుఖారీ)

అబూ మూసా(ర) ఇలా సెలవిచ్చారు : ఒకసారి సూర్యునికి గ్రహణం పట్టింది. దైవప్రవక్త(స) అది చూసి ప్రళయం వచ్చేసిందేమోనని భయపడ్డారు. వెంటనే మస్జిదుకు వెళ్ళి నమాజు చెయ్యటం ప్రారంభించారు. దైవప్రవక్త(స) చాలాసేపు నమాజులో నిలబడ్డారు. సుదీర్ఘమైన రుకూలు, సజ్దాలు చేశారు. అలాంటి ఖియామ్ సుదీర్ఘమైన ఖియామ్, రుకూలు, సజ్దాలు చేసినట్లు నేను ఎప్పుడూ చూడలేదు. నమాజు అయినపోయిన తరువాత ఇలా సెలవిచ్చారు : ఈ గ్రహణం పట్టటం అనేది ఎవరైనా పుట్టటం వల్లనో, మరణించటం వల్లనో సంభవించదు. ఇది అల్లాహ్ తరపు నుంచి ప్రజలకు భయపెట్టటానికి సంభవిస్తుంది. ఇలాంటి వాటిని చూసినప్పుడు అల్లాహ్ వైపునకు పరుగెత్తండి. ఆయన్ను జ్ఞాపకం చెయ్యండి. ఆయన్ని అర్థించండి. క్షమాభిక్ష పెట్టమని వేడుకోండి. (ముస్లిమ్)

హజ్రత్ అబూ అయ్యూబ్ అన్సారీ(ర) ఇలా సెలవిచ్చారు : ఒకసారి దైవప్రవక్త మహాశయులు ముహమ్మద్(స) గారి వద్దకు ఒక వ్యక్తి వచ్చి నాకు సంక్షిప్తమైన హితబోధ ఏదైనా చెయ్యండి అని విన్నవించుకున్నాడు. దానికి సమాధానంగా దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు : నీవు నమాజు చేసేటప్పుడు ఇది నా జీవితానికి సంబంధించిన చివరి నమాజు అని భావించి చెయ్యి. ఇంకా నీవు ఆలోచించి మాట్లాడు. ఎందుకంటే నీవు పలికిన మాట గురించి ప్రళయదినం నాడు ఒకవేళ లెక్క తీసుకోవటం జరిగితే దాని సమాధానంగా ఏమీ చెప్పలేకపోయే స్థితి రాకుండా ఉండేందుకు. ఇంకా ఇతరుల వద్ద ఉన్న ధనం పట్ల వైముఖ్యాన్ని చూపు. (మిష్కాత్) ఇహలోకపు జీవితం వాస్తవికత తెలిసినట్లయితే మనిషి ప్రపంచాన్ని ప్రేమించడు. కనుకనే దైవప్రవక్త(స) చేసే నమాజ్‌ను చివరి నమాజ్‌గా చెయ్యమన్నారు.

ఇంకా కారుణ్యమూర్తి ముహమ్మద్(స) అత్యధికంగా అల్లాహ్ నామాన్ని స్మరిస్తూ ఉండేవారు. ఆయన ఇలా సెలవిచ్చారు : షైతాన్ మనిషి హృదయంపై మోకాళ్ళపై కూర్చొని ఉంటాడు. ఆ మనిషి అల్లాహ్ నామాన్ని జపించినట్లయితే షైతాన్ అక్కడి నుంచి పలాయనం చిత్తగిస్తాడు. ఒకవేళ అల్లాహ్ నామం స్మరించటంలో అశ్రద్ధ వహించినట్లయితే షైతాన్ ఆ మనిషి హృదయంలో దుష్ట ఆలోచనలను రేకెత్తిస్తాడు. (బుఖారీ)

హజ్రత్ ఆయిషా(ర) ఇలా సెలవిచ్చారు : దైవప్రవక్త(స) కూర్చున్నా, నిలబడి ఉన్నా, నడుస్తూ ఉన్నా అన్నివేళలా అల్లాహ్ నామాన్ని స్మరిస్తూనే ఉండేవారు. కనుకనే ఆయన(స) ప్రజలకు అన్ని వేళలకు, అన్ని పనులకు సంబంధించిన దుఆలను నేర్పించారు. ఒకవేళ మనిషి ఆ దుఆలను పఠిస్తూ ఉన్నట్లయితే అన్నివేళలా దైవ నామాన్ని స్మరిస్తూ ఉన్నట్లే.

ఇంకా దైవప్రవక్త(స) అత్యధికంగా దుఆలు కూడా చేసేవారు. ఆయన(స) తహజ్జుద్ నమాజ్ సమయంలో ప్రత్యేకంగా దుఆ చేసేవారు. ఇంకా ఆయన(స) ఇలా సెలవిచ్చారు; రాత్రి చివరి ఘడియల్లో కారుణ్య ప్రభువు చివరి ఆకాశంపై వచ్చి దుఆలను ఆలకిస్తాడు. ఇంకా ఇలా సెలవిస్తాడు, ఎవరైతే ఈ సమయంలో అభ్యర్థిస్తాడో నేను అతని అభ్యర్థనను అంగీకరిస్తాను. ఎవడైతే క్షమాభిక్ష కోరుతాడో నేను అతన్ని క్షమాభిక్ష పెడతాను. (బుఖారీ) కనుకనే దైవప్రవక్త(స) ఏనాడూ ఈ అవకాశాన్ని చేజార్చుకోలేదు.

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
సహజీవన భావనల పావురాయి
గేటురాయి
వారపత్రిక

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

**తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది** **ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

**29 ఆయత్‌లు** **మదీనా అవతరణ**

# 48. అల్ ఫత్హ్

28 – 29 ఆయనే అల్లాహ్, తన సందేశహరుణ్ణి మార్గబోధన, సత్యధర్మంతో పాటు పంపినవాడు, తద్వారా దానికి సమస్త ధర్మవ్యవస్థపైన ఆధిక్యతనివ్వాలని, మరి ఈ యదార్థానికి అల్లాహ్ సాక్ష్యం మటుకే చాలు. ముహమ్మద్ అల్లాహ్ సందేశహరులు మరాయనకు తోడుగా ఉన్నవారు తిరస్కారుల పట్ల కఠినులుగాను, పరస్పరం ఒండొకరిపైన దయగలవారుగాను ఉంటారు.[53] నీవు వారిని చూసి నప్పుడల్లా వారు, రుకూ, సజ్దాలు, అల్లాహ్ అనుగ్రహం, ఆయన ప్రసన్నతల కాంక్షలో నిమగ్నులయి ఉండగా కనుగొంటావు. సజ్దాల ప్రభావాలు వారి ముఖాలపైన తొణికిసలాడుతుంటాయి, వాటివల్ల వారు వేరుగా కనుగొనబడతారు.[54] ఇదీ వారి లక్షణం తౌరాత్‌లో[55] మరి ఇన్జీల్‌లో వారి ఉపమానం ఇలా ఉంది[56]– అదొక పంట, అది తొలుత మొగ్గతొడిగింది, ఆపైన దానికి బలం చేకూరింది, తరువాత అది గట్టిపడింది, ఇక అది దాని మ్రానుపైన నిల్చున్నది. వ్యవసాయదారులకు అది సంతోషపెడుతుంది, తిరస్కారులు వారి వృద్ధివికాసాలకు మండిపోవాలని. ఈ వర్గానికి చెందిన విశ్వసించినవారికి, సత్కార్యాలు ఆచరించినవారికి అల్లాహ్ క్షమాపణ, మహాప్రతిఫల వాగ్దానం చేశాడు.

53. అంటే వారిలోని కాఠిన్యం ఏది ఉన్నా అది ధర్మ శత్రువుల కొరకే, విశ్వాసుల కొరకు కాదు. విశ్వసించిన వారి సమక్షంలో వారు మృదువర్తనులుగా, కరుణామయులు, వాత్సల్య మూర్తులు, సానుభూతిపరాయణులు, ఆపద్బాంధవులుగా ఉంటారు. సిద్ధాంతం, లక్ష్యాల సమైక్యత వారిలో పరస్పరం ప్రేమ, సామ రస్యం, సానుకూలతను జనింపజేస్తుంది.

54. సజ్దాల ప్రభావం అంటే, సజ్దాలు చేయడం వల్ల కొందరు నమాజీల నుదుళ్ళపై కాసిన కాయ కాదు. దీని ఉద్దేశం, దైవభక్తి, ఆత్మ పవిత్రత, సౌజన్యశీలత, శ్రేష్ఠ నైతికతల నిదర్శ నాలు, ఇవి దైవం సమక్షంలో వినమ్రులయిన కారణాన సహజంగానే మనిషి ముఖాన ప్రస్ఫుటమవుతాయి. మానవుని ముఖం తెరచిన పుస్తకం వంటిది. దాని పుటలపైన మనిషి మానసిక స్థితులను అతి సునాయాసంగా దర్శించటం సాధ్య మవుతుంది. ఒక దురహంకారి అయిన మానవుని ముఖం, ఒక వినయశీలుడు, వినమ్ర మనస్కుడు అయిన మనిషి ముఖంకన్నా భిన్నంగా ఉంటుంది. ఒక నీతిలేని మనిషి ముఖం ఒక సౌజన్యశీలుడు, సుగుణ సంపన్నుడయిన మనిషి ముఖంకన్నా వేరుగా గుర్తించవీలవుతుంది. ఒక పోకిరి, దుర్వ్యసనుడయిన వాని ముఖంలోనూ, సజ్జనుడు, పరిశుద్ధ స్వభావి అయిన మనిషి ముఖంలోనూ అతి ప్రస్ఫుటమయిన వ్యత్యాసం కానవస్తుంది. పరమ ప్రభువు సెలవిచ్చిన దాని ఉద్దేశం ఏమిటంటే, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) సహచరులయిన వీరిని చూసీ చూడగానే ఎవరయినా ఒకే చూపులో తెలుసుకోగలుగుతారు, వీరు జనుల్లో కెల్లా ఉత్తమశీలురయిన వ్యక్తులని. ఎందుకంటే దైవభక్తి కాంతి వారి ముఖాలపైన మెరుస్తూ ఉంటుంది. ఇదే విషయాన్ని ఇమామ్ మాలిక్ (రహ్మ) వివరిస్తూ అన్నారు, ప్రవక్త సహచర మహాశయుల సేనలు సిరియా భూభాగంలో ప్రవేశించినప్పుడు సిరియా క్రైస్తవులు అనేవారు, క్రీస్తు శిష్యుల గొప్పదనం గురించి మేము వినేవారము, వీరయితే ఆ మహిమాన్విత వ్యక్తులుగానే అగుపిస్తున్నారు అని.

55. బహుశా ఇది, బైబిల్, ద్వితీయోపదేశ కాండం: 33:2–3 వచనాలకు సూచన కాబోలు. అందులో దైవసందేశహరుల రాకను గురించిన ప్రస్తావన చేస్తూ ఆయన సహచరుల విషయంలో 'పరిశుద్ధులు' అనే పదం ప్రయోగించబడింది. ఇదొకటి తప్ప సహచర మహనీయుల గుణం ఏదయినా తౌరాత్‌లో ప్రస్తావించి ఉన్నట్లయితే అది నేడున్న ప్రక్షిప్త తౌరాత్ గ్రంథంలో దొరకదు.

56. ఈ ఉపమానం మహనీయ ఈసా (అలైహిస్సలామ్) చేసిన ఒక బోధనలో పేర్కొనబడింది. అది బైబిల్, కొత్త నిబంధనలో ఇలా ఉటంకించబడింది :

**56వ పాదసూచిక మిగతా వచ్చే సంచికలో)**

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా(ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ التَّفْسِيرِ
ఖుర్ఆన్ వ్యాఖ్యాన ప్రకరణం
(కితాబుత్తఫ్సీర్)

**15. అల్ హిజ్ర్ సూరా**

## దైవాగ్రహానికి పాత్రులైన వారి బస్తీల నుండి సాగిపోతున్నప్పుడు...

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు -

"హిజ్ర్ ప్రజలు కూడా ప్రవక్తలను అబద్ధీకరించారు." (15: 80)

**544)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) హిజ్ర్ ప్రజల గురించి చెబుతూ, "ఆ జాతి జనులు నివసించిన బస్తీ గుండా సాగిపోవలసి వస్తే దుఃఖంతో విలపిస్తూ సాగి పోండి. ఒకవేళ విలపిస్తూ సాగిపోవటం మీకు చేతకాకపోతే, అటువైపుగా వెళ్ళకండి. జాగ్రత్త! వారిపై వచ్చిపడిన ఆపదే మీపైన కూడా వస్తుందేమో!" అని ఉద్బోధించారు.

## పదేపదే పఠించబడే ఏడు వచనాలు

"(ప్రవక్తా!) నిశ్చయంగా మేము నీకు ఏడు ఆయత్‌లను ఇచ్చాము. అవి మాటిమాటికీ పఠించదగినవి. ఇంకా నీకు మహత్తరమైన ఖుర్ఆన్‌ను ప్రసాదించాము." *(15: 87)*

**545)** అబూ సయీద్ బిన్ ముఅల్లా (రజి) తెలియజేశారు: ప్రవక్త మహ నీయులు (సఅసమ్) నా సమీపం నుండి సాగిపోతూ నన్ను పిలిచారు. ఆ సమయంలో నేను నమాజ్ చేస్తూ ఉన్నాను. నమాజ్ చేయటం పూర్తయ్యాక నేను ఆయన(స) సన్నిధిలో హాజరయ్యాను. "నేను పిలవగానే నీవు ఎందుకు రాలేదు?" అని దైవప్రవక్త(స) అడిగితే, 'నేను నమాజ్‌లో ఉన్నాన'ని విన్నవించుకున్నాను. దానికి ఆయన(స), **"ఏమిటి, అల్లాహ్ ఏమని ఆదేశించాడో తెలీదా? అల్లాహ్ ఆదేశం ఇది: "విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ పిలుపునకూ, ఆయన ప్రవక్త పిలుపునకూ జవాబు పలకండి, ప్రవక్త మీకు జీవితాన్ని ప్రసాదించే దాని వైపునకు పిలిచినప్పుడు".** (8: 24)

తరువాత ఆయన(స) "ఈ రోజు మస్జిద్ నుండి వెడలక ముందే నేను నీకు ఖుర్ఆన్‌లోని ఏడు మహత్తర వచనాల గురించి చెప్పనా?" అని సెలవిచ్చారు. (చెప్పక ముందే) ఆయన మస్జిద్‌నుండి వెడలిపోవడానికి లేచి నప్పుడు, నేనా విషయం గుర్తు చేశాను. అప్పుడాయన(స) ఇలా అన్నారు: "అది అల్‌హమ్దులిల్లాహి రబ్బిల్ ఆలమీన్ సూరా. ఇవి **'సబ్‌వుల్ మసానీ'** (అంటే పదే పదే పఠించబడే ఏడు వచనాలు). ఇదే నాకు ప్రసాదించబడిన మహత్తరమైన ఖుర్ఆన్."

**546)** మహాప్రవక్త (సఅసమ్) ఈ విధంగా ప్రవచించినట్లుగా హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు: "ఉమ్ముల్ ఖుర్ఆన్ (అంటే సూరె ఫాతిహా)యే సబ్‌వుల్ మసానీ, మహత్తరమైన ఖుర్ఆన్."

# ప్రవక్త ముహమ్మద్ (స) పట్ల మన బాధ్యతలు

**డాక్టర్ సాజిద్ అబ్బాసీ**

మానవ సంబంధాలలో ప్రతి ఒక్కరికీ కొన్ని పరస్పర హక్కులు, బాధ్యతలు ఉంటాయి. అల్లాహ్ తన దాసులకు లెక్కలేనన్ని ఉపకారాలు చేశాడు. ఇస్లాం విశ్వాసాల ప్రకారం-దాసు లంతా ఆయనను మాత్రమే ఆరాధించాలి. సృష్టికర్త పట్ల మానవు లకు ఉన్న అత్యంత ప్రాథమిక బాధ్యత ఏమిటంటే, కేవలం ఆ అల్లాహ్‌ను మాత్రమే ఉపాసించాలి, ఆయన ఆరాధనలో ఏ సృష్టినీ భాగస్వామిగా చేయకూడదు.


పిల్లలు తమ తల్లిదండ్రులకు సేవ చేయడం, వారిని గౌరవించడం, వారి శ్రేయస్సు కోసం ప్రార్థించడం, ధర్మబద్ధమైన విషయాలలో వారి మాట పాటించడం వారి బాధ్యత. అలాగే సమాజంలో ఒకరి ప్రాణానికి, ఆస్తికి, మానమర్యాదలకు మరొకరు భంగం కలిగించకుండా, దైవం నిర్ణయించిన హక్కులను నెరవేర్చడం మానవుల పరస్పర ధర్మం.

అదేవిధంగా, ప్రవక్త ముహమ్మద్ (స) గారి పట్ల కూడా ఆయన ఉమ్మత్ (అనుచరులు) నెరవేర్చవలసిన హక్కులు ఉన్నాయి. తల్లిదండ్రుల కంటే మిన్నగా ముస్లిమ్ సమాజ శ్రేయస్సును కాంక్షించే ప్రవక్త, వారిని నరక మార్గం నుండి కాపాడి స్వర్గ మార్గం వైపు నడిపిస్తారు. అందుకే ప్రతి ముస్లిం జీవితంలో ప్రవక్త (స) గారికి అత్యున్నత ప్రాధాన్యత ఉంది.

ప్రవక్త ముహమ్మద్ (స) గారి పట్ల మనకున్న ఈ బాధ్యతలను అల్లాహ్ పవిత్ర ఖురాన్‌లో పలుచోట్ల స్పష్టం చేశాడు. ఆ హక్కులు క్రింది విధంగా ఉన్నాయి:

### 1. దైవప్రవక్తను విశ్వసించడం (ఈమాన్):

" (మానవులారా) ముహమ్మద్ మీలోని ఏ పురుషునికీ తండ్రికారు. కాని ఆయన అల్లాహ్ ప్రవక్త, దైవప్రవక్తల పరంపరను సమాప్తం



చేసే చివరివారు. అల్లాహ్ సకల విషయాల జ్ఞానం కలవాడు."

*(సూరా అల్-అహ్‌జాబ్: 40)*

### 2. దైవప్రవక్త విధేయత

"ప్రవక్తకు విధేయత చూపినవాడు వాస్తవంగా అల్లాహ్‌కు విధేయత చూపినట్లే. కాని ఎవడైతే విముఖుడయ్యాడో అటువంటి వారిపై మేము నిన్ను కావలివానిగా చేసి పంపలేదు."

(అన్-నిసా: 80)

ఈమాన్ (విశ్వాసం)లో ప్రధానమైన అంశం ఏమిటంటే- ఒక ముస్లిం అల్లాహ్ ఏకత్వాన్ని (తౌహీద్) విశ్వసించిన తర్వాత, ప్రవక్త ముహమ్మద్ (స) గారి దైవదౌత్యాన్ని (రిసాలత్) మనస్ఫూర్తిగా విశ్వసించాలి. ఆయన కేవలం ప్రవక్త మాత్రమే కాదు, అల్లాహ్ పంపిన చిట్టచివరి ప్రవక్త. ముహమ్మద్ ప్రవక్త గారిని 'ఖాతమున్ నబియ్యీన్' (అంతిమ ప్రవక్త)గా అంగీకరించకుండా, ఆయన తర్వాత కూడా ఎవరినైనా ప్రవక్తగా నమ్మే వ్యక్తి ముస్లిం కాజాలడు.

అలాగే ప్రవక్త గారితోనే ఇస్లాం ధర్మం సంపూర్ణమైందని నిండు హృదయంతో అంగీకరించడం కూడా విశ్వాసంలో భాగమే. అందువల్ల ధార్మిక విషయాలలో ఎలాంటి మార్పుచేర్పులు చేయడానికి వీల్లేదు. ప్రళయకాలం వరకు వచ్చే మానవాళి సమస్త సమస్యలకు పరిష్కారం ప్రవక్త ముహమ్మద్ (స) అందించిన షరీఅత్ (ధర్మశాస్త్రం)లోనే ఉందని నమ్మడం అత్యవసరం.

ఆయన ఒక మానవునిగా ఉంటూనే దైవదౌత్యం అనే మహోన్నత బాధ్యతను నెరవేర్చారని, ప్రళయకాలం వరకు వచ్చే మానవు లందరికీ తన జీవితాన్ని ఒక ఆదర్శంగా మలిచారని విశ్వసించడం రిసాలత్‌పై ఉన్న విశ్వాసంలో భాగమే. ప్రవక్త(స) గారు ఏ మానవుడి వద్ద చదవడం, రాయడం నేర్చుకోలేదని; నేరుగా సృష్టికర్త అయిన అల్లాహ్ నుండే జ్ఞానాన్ని పొంది మానవాళికి గురువుగా (ముఅల్లిమ్) మారారని నమ్మాలి.

(అల్-జుముఅ: 2, అల్-అలక్: 1-5)

ఈ భూమిపై సన్మార్గ ప్రాప్తికి ఏకైక మార్గం ఇస్లాం ధర్మం, షరీఅత్ మాత్రమేనని అంగీకరించాలి. ఎందుకంటే ప్రస్తుతం ప్రపంచంలో పవిత్ర ఖురాన్ తప్ప మరే ఇతర దైవగ్రంథం దాని అసలు రూపంలో లేదు. జిబ్రయిల్ (అలైహిస్సలాం) ద్వారా పవిత్ర ఖురాన్ ప్రవక్త (స) గారి పవిత్ర హృదయంపై అవతరించిందని, ఆ ఖురాన్ రక్షణ బాధ్యతను అల్లాహ్ తానే స్వయంగా స్వీకరించా డని నమ్మడం కూడా ఈమాన్‌లో భాగమే. కాబట్టి పవిత్ర ఖురాన్ ప్రళయకాలం వరకు సురక్షితమైన గ్రంథంగా నిలిచిపోతుంది. ఇవన్నీ దైవదౌత్యాన్ని విశ్వసించడంలో (ఈమాన్ బిల్ రిసాలత్) ఇమిడి ఉన్న ముఖ్య విషయాలు.

ప్రపంచంలో ప్రవక్త అల్లాహ్ ప్రతినిధిగా ఉంటారు. అల్లాహ్ ఇష్టాయిష్టాలను తెలుసుకునే ఏకైక మార్గం ప్రవక్త వాక్కు, ఆచరణ. అందుకే ప్రవక్త నోటి నుండి వెలువడిన మాటలు చట్టంతో సమానం. కాబట్టి ప్రవక్త విధేయతను అల్లాహ్ విధేయతగా పేర్కొనడం జరిగింది. అయితే హదీసులను తిరస్కరించే వారు (మున్కిరీనే హదీస్) ప్రవక్త యొక్క ఈ హక్కును కాలరాస్తున్నారు. కేవలం ఒక శాతం కల్పిత (మౌజూ) హదీసుల కారణంగా 99 శాతం సరైన (సహీహ్) హదీసులను తిరస్కరించడం అనేది వాస్తవానికి ప్రవక్త విధేయతను నిరాకరించడానికి ఒక కుట్ర మాత్రమే. కల్పిత హదీసులను ఏ విధంగా పరిశీలించాలో తెలుపుతూ హజ్రత్ ఉమర్ (రజి) అబూ మూసా అష్అరీకి రాసిన లేఖలో- హదీసులను ఖురాన్‌పై బేరీజు వేయాలని, ఖురాన్‌కు అనుగుణంగా ఉన్న వాటిని స్వీకరించాలని సూచించారు.

## 3. ప్రవక్త ముహమ్మద్(స) తో గాఢమైన ప్రేమను కలిగి ఉండటం

ప్రవక్త ముహమ్మద్ (స) ప్రవచించారు: "ఎవరి చేతిలో నా ప్రాణం ఉందో ఆ దైవం సాక్షి! మీలో ఎవరూ పరిపూర్ణ విశ్వాసి (మోమిన్) కాలేరు- తన సంతానం మరియు తల్లిదండ్రుల కంటే ఎక్కువగా నేను అతనికి ప్రియమైన వాడను అయ్యేంత వరకు."

*(సునన్ నసాయి: 5018)*

ఈ హదీసు ప్రకారం ప్రవక్తతో ప్రేమ అనేది విశ్వాసానికి ఒక ముఖ్యమైన షరతు. మన తల్లిదండ్రులు లేదా మన సంతానం కంటే ఎక్కువగా ప్రవక్తను ప్రేమించాలి. ఎందుకంటే మన గురించి మనం కూడా అంతగా శ్రేయస్సు కోరుకోలేము, అంతకంటే మిన్నగా ప్రవక్త మన శ్రేయస్సును కోరుకున్నారు.

అల్లాహ్ తాలా దివ్య ఖురాన్‌లో ఇలా ప్రవచించాడు:

"చూడండి! మీవద్దకు ఒక ప్రవక్త వచ్చాడు. ఆయన స్వయంగా మీలోనివాడే. మీరు నష్టానికి గురికావటం అనేది ఆయనకు కష్టం కలిగిస్తుంది. మీ సాఫల్యాన్ని ఆయన తీవ్రంగా కాంక్షిస్తాడు. విశ్వాసులపై ఆయన వాత్సల్యం కలవాడు, కారుణ్యం కలవాడు.

(సూరా అత్-తౌబా: 128)

ప్రవక్త ముహమ్మద్(స) పట్ల ప్రేమకు అసలు నిదర్శనం ఏమిటంటే- మనం ప్రవక్త సహచరులను (సహాబా), అహ్లె బైత్ (ప్రవక్త కుటుంబ సభ్యుల)తో పాటు ఉమ్మహాతుల్ మూమినీన్ (ప్రవక్త సతీమణులు) ని కూడా సత్యసంధంగా ప్రేమించాలి.

## 4. ప్రవక్త ముహమ్మద్ (స) గారిని గౌరవించడం, విధేయత చూపడం

అల్లాహ్ తాలా ఇలా సెలవిచ్చాడు: "విశ్వాసులారా! మీ కంఠ స్వరాన్ని ప్రవక్త కంఠస్వరం కంటే పెంచకండి. మీరు పరస్పరం మాట్లాడుకునే విధంగా ప్రవక్తతో బిగ్గరగా మాట్లాడకండి, దానివల్ల, బహుశా మీరు చేసినదంతా మీకు తెలియకుండానే వ్యర్థమైపోవచ్చు. (సూరా అల్-హుజురాత్: 2)

ప్రవక్త ముహమ్మద్(స) గారి గొంతు కంటే మన గొంతును పైకి లేపడం కూడా దైవప్రవక్త పట్ల అగౌరవంగా (దుశ్చర్యగా) పరిగణించబడింది. ఈ ఆయత్ అవతరించిన తర్వాత సహాబా (ప్రవక్త అనుచరులు) అల్లాహ్‌కు భయపడి ప్రవక్త ముందర తమ గొంతులను ఎంతో తగ్గించుకున్నారు.

ప్రవక్త గారి గౌరవ మర్యాదలలో మరొక ముఖ్యమైన అంశం ఏమిటంటే- ఏ ఇతర వ్యక్తిని కూడా ప్రవక్త కంటే ముందుంచ కూడదు, అనగా ఏ విషయంలోనూ ప్రవక్తను వెనక్కి నెట్టి వేరొకరి అభిప్రాయానికి ప్రాధాన్యత ఇవ్వకూడదు "విశ్వాసులారా! అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకూ ముందు నడవకండి. అల్లాహ్‌కు భయపడండి. అల్లాహ్ సమస్తమూ వినేవాడు, సర్వమూ ఎరిగిన వాడూను." (సూరా అల్-హుజురాత్: 1). ప్రవక్త గారి ప్రవచనాలపై (హదీసులు, సున్నత్) మరే ఇతర వ్యక్తి అభిప్రాయానికి ప్రాధాన్యత ఇవ్వడం లేదా ముందుంచడం వాస్తవానికి ఆయన ఉన్నత స్థానానికి తగిన గౌరవాన్ని ఇవ్వకపోవడమే అవుతుంది.

### 5. ప్రవక్త ముహమ్మద్ గారికి మద్దతు, పరిరక్షణ :

అల్లాహ్ ఖురాన్‌లో ఇలా ప్రవచించాడు: "ఈ సందేశహరుణ్ణి, చదువనూ వ్రాయనూ రాని ఈ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లమ్)ను అనుసరించేవారు (ఈనాడు ఈ కారుణ్యానికి అర్హులు). అతని ప్రస్తావన వారికి తమ వద్ద ఉన్న తౌరాతు, ఇంజీలు గ్రంథాలలో వ్రాయబడి లభిస్తుంది. అతను వారికి మంచిని ఆజ్ఞాపిస్తాడు. చెడు నుండి నిరోధిస్తాడు. వారికొరకు పరిశుద్ధమైన వస్తువులను ధర్మసమ్మతం చేస్తాడు. అపరిశుద్ధమైన వాటిని నిషిద్ధం చేస్తాడు. వారిపై మోపబడివున్న బరువులను దించుతాడు. వారు బంధింపబడిన శృంఖలాలను త్రెంచుతాడు. కనుక అతనిని విశ్వసించీ సమర్థించీ అతనికి సహకరించీ అతనితో అవతరింపజెయ్యబడిన జ్యోతిని అనుసరించేవారు మాత్రమే సాఫల్యం పొందేవారు."

*(సూరా అల్-ఆరాఫ్: 157)*

ఈ ఒక్క ఆయత్ చివరి భాగంలో ప్రవక్త ముహమ్మద్ (స) పట్ల మనకు ఉన్న నాలుగు ప్రధాన హక్కులు/బాధ్యతలు స్పష్టంగా తెలుపబడ్డాయి : ఆయన దైవదౌత్యాన్ని విశ్వసించడం, ఆయనను రక్షించడం, ఆయనకు సహాయ సహకారాలు అందించడం, పవిత్ర ఖురాన్‌ను అనుసరించడం.

ప్రవక్త ముహమ్మద్(స) జీవించి ఉన్న కాలంలో సహాబా (సహచరులు) వివిధ యుద్ధాలలో (గజ్వాత్) ప్రాణాలకు తెగించి ఆయనను పరిరక్షించారు. ముఖ్యంగా 'ఉహుద్ యుద్ధం'లో పది మంది అన్సారీ సహాబా ప్రవక్తను రక్షించే మార్గంలో ప్రాణాలు కోల్పోయి షహీద్ (మరణం) అయ్యారు. అలాగే తల్హా బిన్ ఉబైదుల్లా (రజి) ప్రవక్త ముహమ్మద్ (స) ముందు అడ్డుగోడలా నిలబడి, తీవ్రంగా గాయపడి రక్షణ కల్పించారు. వారి శరీరాలపై డెబ్బైకి పైగా గాయాలయ్యాయి. అప్పుడు ప్రవక్త మాట్లాడుతూ- "ఎవరైనా సంచరిస్తున్న అమరవీరుడిని (జీవించి ఉన్న షహీద్‌ను) చూడాలనుకుంటే తల్హా వైపు చూడండి" అని ప్రశంసించారు. అదేవిధంగా, శత్రువులు (ఇస్లాం వ్యతిరేకులు) కవితల ద్వారా ప్రవక్తను ఎగతాళి చేసినప్పుడు, హస్సాన్ బిన్ సాబిత్ (రజి) కవితలు రాసి ప్రవక్త పక్షాన నిలబడి సమర్థించేవారు.

### ప్రస్తుత కాలంలో ప్రవక్త (స) గారి పరిరక్షణ అంటే ఏమిటి?

ఇస్లాం శత్రువులు లేవనెత్తే అవాస్తవ ఆరోపణలకు తార్కికమైన, బలమైన ఆధారాలతో సమాధానాలు ఇవ్వడం; మునుపెన్నడూ లేని విధంగా ముస్లిమేతరుల ముందు ప్రవక్త ముహమ్మద్ గారి నిజమైన, శాంతియుతమైన ఆదర్శ రూపాన్ని ఆవిష్కరించడమే నేటి కాలంలో ప్రవక్త పట్ల మన బాధ్యత.

### 6. ప్రవక్త ముహమ్మద్ (స) గారి మిషన్‌ను స్వీకరించడం ద్వారా సహాయసహకారాలు అందించడం:

అల్లాహ్ ఖురాన్‌లో వివిధ సందర్భాలలో ప్రవక్త గారి దైవదౌత్య బాధ్యతలను వివరిస్తూ- ఆయనను 'షాహిద్' (సాక్షి), 'ముబష్షిర్' (శుభవార్త ఇచ్చువాడు), 'నజీర్' (హెచ్చరించువాడు), 'దాఈ ఇలల్లాహ్' (అల్లాహ్ వైపునకు పిలుపునిచ్చువాడు), మరియు 'సిరాజుమ్ మునీర్' (ప్రకాశవంతమైన దీపం) వంటి ఉన్నత పదవులతో ఆయన మిషన్‌ను స్పష్టం చేశాడు.

మరొకచోట ఆయనను 'ముఅల్లిమ్' (గురువు), 'ముజక్కి' (పరిశుద్ధపరచువాడు) గా ప్రవక్త పాత్రను తెలిపారు. (సూరా అల్-జుముఅ: 2). అలాగే ఇస్లాం ధర్మాన్ని సమస్త ధర్మాలపై విజయం సాధింపజేయడానికి అవిశ్రాంతంగా శ్రమించిన వ్యక్తిగా ఆయనను అభివర్ణించారు (సూరా అస్-సఫ్: 9). ఖురాన్‌లో పేర్కొన్న ఈ ప్రవక్త బాధ్యతలన్నీ ఇప్పుడు ముస్లిం సమాజం భుజస్కంధాలపైకి మార్చబడ్డాయి. దీనివల్ల ఇస్లాం సందేశం మానవాళి అందరికీ చేరుతూ ఉండాలని నిర్దేశించబడింది (సూరా అల్-బఖరా: 143).

సహాబా (సహచరులు) తమ హోదాను, బాధ్యతను ప్రవక్త ముహమ్మద్(స) గారి మిషన్‌తో ముడిపెట్టుకున్నారు. ప్రవక్త గారి ధ్యేయాన్నే తమ జీవిత ఆశయంగా మలుచుకుని ప్రపంచంలోని వివిధ ఖండాలకు వెళ్లి, ఇస్లాం వెలుగులతో విభిన్న ప్రాంతాలను ప్రకాశింపజేశారు.

నేటి కాలంలో ప్రవక్త గారికి సహాయం అందించడం అంటే- ఆయన దైవదౌత్యపు ఆశయాలను ముస్లిం సమాజం తన జీవిత ఆశయంగా మార్చుకోవడమే. ముఖ్యంగా 'దావత్ ఇలల్లాహ్' (అల్లాహ్ వైపునకు పిలుపు) బాధ్యతను తమ మనుగడకు పరమ లక్ష్యంగా ఎంచుకుని మానవాళికి మార్గదర్శకత్వం వహించాలి.

ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్న ప్రాంతాలలో వారి జీవిత లక్ష్యం ఏమిటంటే- ప్రవక్త ముహమ్మద్ (స) మదీనాలో ఇస్లామిక్ రాజ్యాన్ని స్థాపించి షరీయత్‌ను అమలు చేసినట్లే, తమ వ్యక్తిగత జీవితంలో, సమాజంలో ధర్మాన్ని స్థాపించడానికి కృషి చేయాలి. ధర్మ స్థాపన అనేది వాస్తవానికి అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తలకు నిజమైన సహాయం అందించడమే అవుతుంది (సూరా ముహమ్మద్: 7).

### 7. ప్రవక్త ముహమ్మద్ (స) గారిపై అవతరించిన దైవవాణి (ఖురాన్)ను అనుసరించడం:

పవిత్ర ఖురాన్‌ను 'నూర్' (జ్యోతి/వెలుగు) అని అభివర్ణించారు.

ఈ విశ్వం పరోక్ష సత్యాలపై వెలుగులు ప్రసరింపజేసి, వాటిని స్పష్టంగా ఆవిష్కరించే ఏకైక దివ్య కాంతి ఖురాన్ మాత్రమే. బయటి నుండి కాంతి లభించనప్పుడు, చీకటిలో ఎంత మంచి దృష్టి ఉన్నా అది ఏమాత్రం ఉపయోగపడదు. అలాగే దైవిక మార్గదర్శకత్వం అనే వెలుగు అందనంతవరకు, మానవునికి ఎంతటి అంతర్దృష్టి ఉన్నప్పటికీ అతను సన్మార్గం పొందలేడు.

నేడు ఖురాన్ ప్రసాదించే దివ్య జ్యోతి నుండి ప్రయోజనం పొందడం మాని, కేవలం పుణ్యం కోసం మాత్రమే ఖురాన్‌ను పఠిస్తున్నారు. ఖురాన్ బోధనలు గ్రహించడానికి సులభతరం చేశామని చెప్పబడింది (సూరా అల్-ఖమర్). దీని అవతరణ ప్రధాన ఉద్దేశమే ఖురాన్ ఆయతులను పరిశీలించి, వాటిపై 'తదబ్బుర్' (చింతన/ఆలోచన) చేస్తూ సత్యాలను గ్రహించడమే (సూరా సాద్: 29). హదీసులో ప్రవచించబడింది: "అల్లాహ్ ఈ ఖురాన్ ద్వారానే (దీనికి అనుగుణంగా ప్రవర్తించడం వల్ల) కొన్ని జాతులను ఉన్నత స్థానాలకు చేర్చుతాడు; అలాగే ఈ ఖురాన్‌ను (దీని బోధనలను విస్మరించడం వల్ల) కొన్ని జాతులను పతనానికి గురిచేస్తాడు." (ముస్నద్ అహ్మద్: 232)

## 8. ప్రవక్త ముహమ్మద్ (స) గారి మాటలను సంపూర్ణంగా విశ్వసించడం

ప్రవక్త ముహమ్మద్ (స) గారి వాక్కులను, ఆచరణలను ఎలాంటి అనుమానాలు, సంకోచాలు లేకుండా అంతఃకరణశుద్ధితో సత్యమని నమ్మాలి. ప్రవక్త (స) 'ఇస్రా మేరాజ్' (రాత్రి ప్రయాణం మరియు ఆకాశారోహణ) సంఘటన వివరాలను ప్రజల ముందు ఉంచినప్పుడు, ఇస్లాం వ్యతిరేకులు ఆయనను తీవ్రంగా ఎగతాళి చేశారు. ఈ సంఘటనను హజ్రత్ అబూ బక్ర్ (రజి) ముందు ఉంచుతూ-"రాత్రికి రాత్రే నీ మిత్రుడు ఆకాశాల సమ్మేళనానికి వెళ్లొచ్చారు" అని చెప్పినప్పుడు, అబూ బక్ర్ (రజి) సంశయిస్తారని వారు భావించారు. కానీ అబూ బక్ర్ (రజి) వెంటనే స్పందిస్తూ- "ఒకవేళ ముహమ్మద్ రసూలుల్లాహ్ స్వయంగా ఈ మాట చెప్పారంటే, అది వందశాతం సత్యం; అందులో ఎటువంటి అనుమానానికి తావులేదు"అని బదులిచ్చారు. ఈ అచంచల మైన విశ్వాసానికి గుర్తింపుగానే ఆయనకు 'సిద్దీఖ్' (అత్యంత సత్య వర్తనుడు) అనే బిరుదు లభించింది.

అంతేకాక, ప్రవక్త ఆహ్వానించిన వెంటనే ఇస్లాంను మొదటగా స్వీకరించిన వారిలో అబూ బక్ర్ (రజి) అగ్రగణ్యులు. దైవప్రవక్త (స) గారి ఏ ఒక్క వాక్కునైనా లేదా ఆచరణనైనా మనస్ఫూర్తిగా అంగీకరించకపోవడం అనేది మనిషి విశ్వాసాన్ని (ఈమాన్) తీవ్ర ప్రమాదంలోకి నెట్టివేస్తుంది.

## 9. ప్రవక్త ముహమ్మద్ (స) గారిని అంతిమ న్యాయమూర్తిగా అంగీకరించడం:

అల్లాహ్ తాలా ఇలా ప్రవచించాడు: "ముహమ్మద్! నీ ప్రభువు సాక్షిగా! వారు తమ పరస్పర విభేదాల విషయంలో నిన్ను న్యాయనిర్ణేతగా స్వీకరించబడనంతవరకు, ఇంకా నీవు ఏ నిర్ణయం చేసినా దానిని గురించి వారి మనస్సులలో కూడా ఏమాత్రం సంకోచం లేకుండా దానిని యథాతథంగా శిరసావహించనంత వరకు వారు నిజమైన విశ్వాసులు కాలేరు. " (అన్-నిసా: 65)

## 10. ప్రవక్త ముహమ్మద్ (స) గారిపై దురూద్ పంపడం

అల్లాహ్ తాలా ఖురాన్‌లో ఇలా ప్రవచించాడు: "అల్లాహ్ ఆయన దూతలు దైవప్రవక్తకై 'దురూద్'ను పంపుతారు. విశ్వాసులారా! మీరు కూడ ఆయనకై దురూద్, సలామ్‌లు పంపండి.
(అల్-అహ్‌జాబ్: 56)

అన్నిటికంటే ముందు స్వయంగా అల్లాహ్ తాలా తన ప్రవక్తపై దరూద్, సలామ్ పంపుతున్నాడు. ఆ తర్వాత దైవదూతలు ఆయనపై దరూద్ పంపుతున్నారు. చివరగా ఓ విశ్వాసులారా! మీరూ ప్రవక్త ముహమ్మద్(స) పై దరూద్, సలామ్ పంపండి అని ఆదేశించబడింది. ఇది ముస్లింలపై ఉన్న అత్యంత కీలకమైన బాధ్యత. ప్రవక్త గారి పేరు ప్రస్తావనకు వచ్చినప్పుడు ఎవరైతే ఆయనపై దరూద్ పంపరో, అలాంటి వ్యక్తిని అత్యంత పిసినారి అని వర్ణించారు. మరొక సందర్భంలో ప్రవక్త గారి పేరు విన్నప్పటికీ దరూద్ పంపని వారిపై శాపనార్థాలు (అభద్రత) వ్యక్తమయ్యాయి.

వాస్తవానికి అల్లాహ్ తాలా ప్రవక్త ముహమ్మద్(స)తో చేసిన వాగ్దానం ఏమిటంటే, ఆయన పేరును, కీర్తిని సర్వవ్యాప్తం చేసి ఉన్నతంగా మారుస్తానని తెలిపాడు (సూరా అల్-ఇన్షిరాహ్: 4). అందుకే ప్రతి ముస్లిం తన నమాజులలో మరియు దైనందిన జిక్ర్ (స్మరణలో)లో విధిగా దరూద్ పఠించాలని ఆదేశించబడింది. ఇందులో పూర్తిగా మనకే ఎంతో ప్రయోజనం ఉంది. ప్రవక్త ప్రవచించారు: "ఎవరైతే నాపై ఒక్కసారి దరూద్ పంపుతారో, అల్లాహ్ తాలా ఆయనపై పది కారుణ్యాలు కురిపిస్తాడు, పది పాపాలను క్షమిస్తాడు, స్వర్గంలో పది స్థానాలను ఉన్నతీకరిస్తాడు" (ముస్నద్ అహ్మద్).

ప్రవక్త ముహమ్మద్ గారి పట్ల మనకు ఉన్న బాధ్యతలు, హక్కులు ఇవే. వీటిని సక్రమంగా నిర్వర్తించడం ద్వారానే మనం ఈ లోకంలో సఫలతను సాధించగలం, పరలోకంలో స్వర్గానికి అర్హులం కాగలం. ప్రళయ దినాన 'హౌజ్-ఎ-కౌసర్' వద్ద ఆయన చేతుల మీదుగా దాహార్తిని తీర్చుకోగలగాలన్నా, పరలోకంలో ఆయన సిఫార్సు (షఫాఅత్) పొందే భాగ్యం దక్కాలన్నా- అది ప్రవక్త ముహమ్మద్ గారిపై గాఢమైన ప్రేమను కలిగి ఉంటూ, ఈ హక్కులను, బాధ్యతలను నెరవేర్చినవారికే లభిస్తుంది. ●



# ప్రవక్త బాట... మానవతకు వెలుగు బాట

- తహూరా సిద్దీఖా

**చరిత్ర**లో అనేకమంది మహనీయులు, ప్రజా నాయకులు, తత్త్వవేత్తలు ఆవిర్భవించారు. అయితే తమ మాటలకు, చేతలకు, నిత్యజీవిత నడవడికకు మధ్య ఎటువంటి వ్యత్యాసం లేకుండా సంపూర్ణమైన ఆదర్శవంతమైన జీవితాన్ని జీవించి చూపినవారు అత్యంత అరుదు. అటువంటి పరిపూర్ణ వ్యక్తిత్వానికి నిలువెత్తు నిదర్శనం హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త (స) వారి జీవితం. ఆయన ప్రవచించిన ధర్మసూత్రాలు మాత్రమే కాక, దైనందిన జీవితంలో ఆచరించి చూపిన నడవడిక, సంస్కరణలు, నిరాడంబరత, చారిత్రక సంఘటనల వెనుక ఉన్న మానవీయ కోణాలు నేటి సమాజానికి గొప్ప మార్గదర్శకాలు.

## 1. ప్రవక్త గారి గృహ జీవితం

చాలామంది ప్రముఖులు సమాజంలో పబ్లిక్ లైఫ్‌లో ఎంతో ఆదర్శవంతంగా కనిపించినప్పటికీ, వారి వ్యక్తిగత లేదా గృహ జీవితంలో అనేక లోపాలు కనిపిస్తుంటాయి. కానీ ప్రవక్త గారి జీవితం బహిరంగంగా ఎంత పవిత్రమైనదో, గృహ జీవితంలోనూ అంతటి పారదర్శకమైనది. ఆయన తన కుటుంబ సభ్యులతో నడుచుకున్న తీరు గృహస్థులందరికీ శిరోధార్యం.

**చేదోడు వాదోడుగా దైనందిన పనులు** : ప్రవక్త గారు ఇంట్లో ఉన్నప్పుడు ఖాళీగా కూర్చోకుండా భార్యలకు ఇంటి పనుల్లో నేరుగా సహాయం చేసేవారు. సొంత దుస్తులను తామే కుట్టుకోవడం, చెప్పులు సరిచేసుకోవడం, మేకల పాలు పితకడం, ఇల్లు ఊడ్వడం వంటి పనులను ఎంతో ఇష్టంగా చేసేవారు.

**ఆప్యాయత, గౌరవం** : "మీలో అత్యుత్తమ వ్యక్తి ఎవరంటే, తన భార్యాపిల్లలతో అత్యుత్తమంగా ప్రవర్తించేవాడే" అని ప్రవక్త గారు ఉద్బోధించారు. భార్యలతో సరదాగా మాట్లాడటం, వారితో కలిసి పరుగు పందెం వంటి సరదా పోటీల్లో పాల్గొనడం, వారి భావోద్వేగాలను గౌరవించడం ఆయన అలవాటు.

**పిల్లల పట్ల అమితమైన వాత్సల్యం** : దారినపోయే పిల్లలను సైతం ఆప్యాయంగా పలకరించి, ఎత్తుకొని ముద్దాడేవారు. తన మనవళ్లు హజ్రత్ హసన్, హుసైన్‌లతో కలిసి ఆడుకునేవారు. నాటి అరబ్ సమాజంలో ఆడపిల్లలను హీనంగా చూసే ఆచారానికి స్వస్తి పలికి, కుమార్తె ఫాతిమా(రజి) వస్తే గౌరవంగా నిలబడి ఆహ్వానించేవారు.

## 2. 'సుఫ్ఫా' (Suffa) : విశ్వవిద్యాలయానికి మొదటి పునాది

మదీనాకు హిజ్రత్ (వలస) వచ్చిన తర్వాత మస్జిదె నబవీకి అనుకుని ఏర్పాటు చేసిన 'సుఫ్ఫా' అనే అరుగు కేవలం నిరాశ్రయుల ఆశ్రయం మాత్రమే కాదు. అది మానవ చరిత్రలోనే మొదటి ఆవాస (Residential) విద్యా పీఠంగా విరాజిల్లింది.

**ఉచిత విద్య- సామరస్యం** : ఆ కాలంలో అక్షరాస్యత శాతాన్ని పెంచడానికి ప్రవక్త గారు సుఫ్ఫా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

నిప్పించారు. ఇక్కడ వందలాది మంది సహాబాలు (అనుచరులు) ఉంటూ రాత్రింబవళ్ళు ఖురాన్ అధ్యయనం, వ్యాకరణం, అక్షరాస్యత, ధర్మశాస్త్రం, నైతిక విలువలను నేర్చుకునేవారు.

**సమాజంలో మార్పు** : ప్రవక్త గారు స్వయంగా ఉపాధ్యాయుడిగా ఉంటూ వారి సందేహాలను నివృత్తి చేసేవారు. సుఫ్ఫా ద్వారా శిక్షణ పొందిన పండితులే తదనంతర కాలంలో ప్రపంచంలోని నలుమూలలకు వెళ్ళి విజ్ఞానాన్ని ప్రచారం చేశారు. పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదనే ఉచిత విద్యా విధానానికి సుఫ్ఫా ఒక ప్రత్యక్ష ఉదాహరణ.

## 3. ప్రసన్న వదనం... ఒక దివ్యౌషధం!

కఠినత్వం, కోపం లేని ప్రసన్నమైన వదనం ప్రవక్త గారి ఆభరణం. అనుచరులు పేర్కొన్న ప్రకారం, ప్రవక్త గారి కంటే ఎక్కువగా చిరునవ్వు చిందించే వ్యక్తిని వారు ఎన్నడూ చూడలేదు.

**చిరునవ్వు ఒక పుణ్యకార్యం** : సమాజంలో ప్రతి ఒక్కరినీ చిరునవ్వుతో పలకరించడం కూడా ఒక పుణ్యకార్యమని (సదఖా) ఆయన బోధించారు.

**సభా సంస్కృతి** : మజ్లిసులలో (సభలలో) అందరితో కలిసిపోయే వారు. చిన్న పిల్లలతో చమత్కారంగా మాట్లాడేవారు. ప్రశాంతమైన చిరునవ్వుతో ఆయన శత్రువుల హృదయాలను సైతం గెలుచుకున్నారు. తీవ్రమైన ఒత్తిడి, మానసిక ఆందోళనలు ఉన్న సమయాల్లో కూడా ఆయన చిరునవ్వుతో సమాజానికి ధైర్యాన్ని నూరిపోసారు.

## 4. సామాజిక న్యాయం

ప్రవక్త పదవి లభించక ముందే (యువకుడిగా ఉన్నప్పుడే) నాటి అరబ్ సమాజంలో జరుగుతున్న దోపిడీలు, అన్యాయాలను అరికట్టడానికి 'హిల్ ఫుల్-ఫుజూల్' అనే శాంతి ఒప్పందంలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించారు.

**బాధితులకు అభయం** : బాధితులు ఎవరున్నా, ఏ తెగకు చెందిన వారైనా వారికి న్యాయం చేయడమే ఈ ఒప్పందం ముఖ్య ఉద్దేశ్యం.

**విశ్వజనీన సూత్రం** : ప్రవక్త అయిన తర్వాత కూడా "అటువంటి శాంతి ఒప్పందానికి ఈ రోజు పిలిచినా నేను సంతోషంగా హాజరవుతాను" అని ప్రకటించడం ఆయన విశ్వజనీన శాంతి కాముకతకు, మానవ హక్కుల పట్ల ఆయనకున్న కట్టుబాటుకు ప్రత్యక్ష సాక్ష్యం.

## 5. హజ్ ఆచారాలలో చేసిన నవీకరణలు- మానవ సమత

ఇస్లాం పూర్వ కాలంలో హజ్ యాత్రలో కొన్ని రకాల జాతి, కుల, ప్రాంతీయ వివక్షలు ప్రాచుర్యంలో ఉండేవి. ఖురైష్ తెగవారు తమను తాము అధికులమని భావిస్తూ ప్రత్యేక సదుపాయాలు అనుభవించేవారు.

**సామాజిక సమానత్వం** : ప్రవక్త గారు హజ్ నిర్వహణలో ఉన్న అపక్రమాలను తొలగించి అందరినీ ఒకే వరుసలో నిలబెట్టారు.

**జాతి వివక్ష నిర్మూలన** : "ఏ అరబ్బీకీ అరబ్బేతరుడిపై, ఏ తెల్లవారికీ నల్లవారిపై శ్రేష్ఠత లేదు; శ్రేష్ఠత కేవలం దైవభీతి, మంచి ప్రవర్తన ఆధారంగానే ఉంటుంది" అని ప్రకటించి సర్వమానవ సమానత్వాన్ని హజ్ వేదికగా చాటిచెప్పారు.

## 6. చారిత్రక సంఘటనల సరైన అవగాహన- సందేహాల నివృత్తి

**సుల్హ్-ఎ-హుదైబియా (శాంతి ఒప్పందం)** : ఈ ఒప్పందంలోని నిబంధనలు ప్రవక్త గారి దూరదృష్టి వల్ల అది సుదీర్ఘ శాంతికి, ధర్మ విస్తరణకు దారితీసిందని వివరించారు.

**యుద్ధాలు, శాంతి యత్నాలు** : ప్రవక్త గారు చేపట్టిన సైనిక చర్యలు కేవలం స్వయం రక్షణ, సమాజంలో శాంతి భద్రతల పునరుద్ధరణ కోసమే తప్ప భూభాగాల ఆక్రమణ లేదా బలవంతపు మత మార్పిడుల కోసం కాదని చారిత్రక ఆధారాలతో విశదీకరించారు.

## 7. సమాజంలోని నిరుపేదలు, బలహీన వర్గాల హక్కులు

నాటి సమాజంలో ఉన్న పేదలు, బానిసలు, దిక్కులేని వర్గాల పట్ల ప్రవక్త గారు చూపిన కరుణ అసమానమైనది.

**బానిసత్వ నిర్మూలనకు బాటలు** : బానిసలకు విముక్తి కలిగించడాన్ని గొప్ప పుణ్యకార్యంగా ప్రకటించారు. తమ ఇంట్లో పనిచేసే పనివారలకు తాము తినే ఆహారాన్నే ఇవ్వాలని, తాము తొడిగే దుస్తులనే తొడిగించాలని ఆదేశించారు.

**బలహీన వర్గాల రక్షణ** : అనాథల ఆస్తులను కాపాడటం, వితంతువులకు ఆసరాగా నిలవడం సమాజ ప్రాథమిక బాధ్యతగా మార్చారు.

## 8. ఆర్థిక వ్యవహారాలు - నిరాడంబరత

ఒక దేశానికి నాయకుడిగా ఉండి కూడా ప్రవక్త గారు అత్యంత నిరాడంబర జీవితాన్ని గడిపారు.

**స్వార్థరహిత జీవితం** : ఆయన ఇంట్లో వరుసగా రెండు మూడు రోజుల పాటు పొయ్యి వెలగని రోజులు ఉండేవి. కేవలం ఖర్జూరాలు, నీళ్లతో రోజులు గడిపేవారు.

**ప్రజా సంక్షేమం** : తన వద్దకు వచ్చిన ఏ సంపదనైనా పేదలకు, అనాథలకు పంచిపెట్టేవారు. ప్రవక్త గారు మరణించే సమయానికి


ఆయన వద్ద ఎటువంటి ఆస్తిపాస్తులు లేవు; కనీసం ఆయన యుద్ధ కవచం ఒక యూదుడి వద్ద ధాన్యపు అప్పు కోసం కుదువబెట్టి ఉండింది. ఇది ఆయన నిరాడంబరతకు పరాకాష్ఠ.

### నేటి సమాజానికి సందేశం

విద్వేషాలు, అసహనం, మానసిక అలజడులు పెరుగుతున్న నేటి ఆధునిక కాలంలో హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లమ్) గారి సీరత్ మానవాళికి ఒక దివ్యౌషధంలా పనిచేస్తుంది. కుటుంబంలో ప్రేమ, విద్యా రంగంలో ఉచిత ప్రాధాన్యత, సమాజంలో సమరసత, పేదల పట్ల కరుణ, శత్రువుల పట్ల కూడా క్షమాగుణం వహించడం వంటి మహత్తర విలువలు ఆయన జీవితం ద్వారా మనకు లభిస్తాయి. ఆయన చూపిన బాట ప్రశాంతమైన, సౌభాగ్యవంతమైన మానవ సమాజ నిర్మాణానికి ప్రాణాధారం.

# మహనీయ ఖాలిద్ బిన్ వలీద్(రజి) పుస్తకావిష్కరణ






**ప్రవక్త** ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) సహచర మాన్యులు హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్(రజి) జీవిత చరిత్ర నేపథ్యంలో తెలుగులో ప్రచురించబడిన **'మహనీయ ఖాలిద్ బిన్ వలీద్(రజి)'** అనే పుస్తకాన్ని జమాఅతె ఇస్లామీ హింద్, తెలంగాణ రాష్ట్రాధ్యక్షులు జనాబ్ ముహమ్మద్ అజ్హరుద్దీన్ ఆవిష్కరించారు. 2026 ఆగస్టు 18వ తేదీ సాయంత్రం లక్కడ్‌కోట్‌లోని జమాఅత్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ పుస్తకం ఆవిష్కరించబడింది. ఈ కార్యక్రమంలో టి.ఐ.పి, గీటురాయి సిబ్బందితోపాటు తెలుగు అనువాదకుడు జనాబ్ షేక్ యూసుఫ్ ఖాన్, ఆయన కుమారుడు ఆసిఫ్ అహ్మద్ పాల్గొన్నారు.

ఇనాయతుల్లాహ్ అల్తమష్ ఉర్దూలో రచించిన నవల 'షంషీర్ బే నియామ్' ఆధారంగా 1999–2001 మధ్య కాలంలో గీటురాయిలో **'దైవ కరవాలం'** పేరుతో 114 ఎపిసోడ్లుగా– ధారావాహికంగా వచ్చిన నవల ప్రస్తుతం తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పుస్తక రూపం దాల్చిందని ఖుర్ఆన్ తెలుగు అనువాదకుడు శ్రీ ముహమ్మద్ అజీజుర్రహ్మాన్ తెలిపారు.

ప్రవక్త ప్రియ సహచరులలో మహనీయ ఖాలిద్ బిన్ వలీద్(రజి)కు ఇస్లామ్ చరిత్రలో విశిష్ట స్థానముంది. హుదైబియా ఒడంబడిక (హిజ్రీ 6) వరకూ ఇస్లామ్‌కు, ప్రవక్త ముహమ్మద్(స)కు బద్ధ విరోధిగా ఉన్న ఖాలిద్ బిన్ వలీద్(రజి) మనసు మార్చుకుని ఇస్లామ్ ఒడిలో సేద తీరారు. అసాధారణమైన తన రణతంత్రపుటెత్తులతో కిస్రా, ఖైసర్ గుండెల్లో నిద్రపోయారు. మౌతా యుద్ధంలో దాదాపు మృత్యు కుహరం లోనికి వెళ్ళిపోయిన ముస్లిం సేనను తన యుద్ధ నైపుణ్యంతో కాపాడుకున్నారు. ప్రవక్త మహనీయులు(స) ఆయన్ని 'సైఫుల్లాహ్' (దైవ కరవాలం) అనే బిరుదుతో సత్కరించారు.

ఆద్యంతం ఉత్కంఠను రేపి, పాఠకులను ఉర్రూతలూగించే ఈ పుస్తకాన్ని వెలువరిస్తున్నందుకు టి.ఐ.పి ప్రకాశకులు సంతోషం వ్యక్తం చేశారు.

**ప్రతులకు :** తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్

**తెలుగు అనువాదకులు :** షేఖ్ యూసుఫ్ ఖాన్
ఆబిదా సాలెహాతి

★★★




**శ్రమకు తగిన గుర్తింపు ఇచ్చి, శ్రామికుడికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో పాటు ఆత్మగౌరవాన్ని ప్రసాదించిన మహోన్నత భావజాలం ఇస్లాం. సమాజ పురోగతికి అహరహం శ్రమించే కార్మిక వర్గాన్ని కేవలం పని మనుషులుగా కాకుండా, సొంత సోదరులుగా చూడాలని దైవప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) లోకానికి చాటిచెప్పారు. తన జీవితపు చివరి నిమిషం వరకు శ్రామికుల, సేవకుల హక్కుల పరిరక్షణ కోసం ఆయన నిరంతరం బోధిస్తూనే ఉన్నారు.**

## కార్మికుల పట్ల మానవీయ దృక్పథం- ప్రధానాంశాలు:

**సోదరభావం** : పనిచేసే వారిని యజమానులు తమ సోదరులుగా భావించి ఆదరించాలి.

**కష్టాల నుండి ఉపశమనం** : శ్రామికులను ఎలాంటి మానసిక, శారీరక శ్రమలకు, వేధింపులకు గురి చేయకుండా ఎంతో మర్యాదతో ప్రవర్తించాలి.

**అస్వస్థత వేళ పరామర్శ** : సేవకులు, ఉద్యోగులు అనారోగ్యానికి గురైనప్పుడు వారిని స్వయంగా వెళ్లి పరామర్శించడం ప్రవక్త నేర్పిన ఆచారం.

**ఆర్థిక, సామాజిక భద్రత** : నిర్ణీత వేతనంతో మాత్రమే సరిపెట్టకుండా వారి ఇతర అవసరాలను తీర్చాలి; నిరంతరం వారి క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకోవాలి.

**ఆఖరి సందేశం** : ప్రవక్త తన అంతిమ ఘడియల్లో కూడా ''నమాజ్ (ప్రార్థనలు), మీ సేవకుల/ కార్మికుల పట్ల అత్యంత శ్రద్ధ వహించండి'' అని మానవాళికి హితవు పలికారు.

## యజమాని ప్రవర్తన ఎలా ఉండాలి?

ఉద్యోగులతో యజమానులు ఎలా వ్యవహరించాలనే దానికి స్పష్టమైన మార్గదర్శనం చేస్తూ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం), "వారు మీ సోదరులు" అని పేర్కొన్నారు. అంటే, వారిపై పాలకుల వలె శాస అధికారాన్ని చెలాయించకుండా సదరు కార్మికులను తోడబుట్టిన వారిలా ఆదరించాలి. ఒక యజమానిగా హజ్రత్ షోయబ్ (అలైహిస్సలాం) ఉన్నతమైన లక్షణాలను పరిశుద్ధ ఖురాన్ ఈ విధంగా కొనియాడింది:

"ఆయన (షోయబ్) ఇలా అన్నాడు: 'నేను నా ఈ ఇద్దరు కుమార్తెలలో ఒకరిని నీకు వివాహం చేయాలనుకుంటున్నాను; దానికి ప్రతిఫలంగా నీవు ఎనిమిదేళ్ళు నా వద్ద సేవ చేయాలి. ఒకవేళ నీవు పదేళ్ళు పూర్తి చేస్తే అది నీ వైపు నుండి కొండంత ఉపకారం. నిన్ను ఏ విధమైన కష్టానికి గురిచేయాలని నేను భావించడం లేదు. ఇన్షా అల్లాహ్, నీవు నన్ను సజ్జనులలో ఒకడిగా చూస్తావు.'" (ఖురాన్ 28:27)

ఈ ఆయత్ ద్వారా యజమాని తన ఉద్యోగిని ఎలాంటి మానసిక, శారీరక ఇబ్బందులకు గురిచేయకూడదనే సందేశం స్పష్టమవుతోంది. ప్రవక్త జీవితంలో కూడా దీనికి అనేక సజీవ నిదర్శనాలు

ఉన్నాయి. యజమానులు తమ కింద పనిచేసే వారిని గౌరవించా లని ఆయన బహుముఖాల ఆదేశించారు. అబూ హురైరా (రజియల్లాహు అన్హు) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త ఇలా తెలిపారు:

"మీ సేవకుడు మీ కోసం ఆహారం సిద్ధం చేసి తెచ్చినప్పుడు, అతన్ని మీతో పాటు కూర్చోబెట్టుకొని తినిపించలేకపోతే, కనీసం ఒకటి లేదా రెండు గుప్పిళ్ళ ఆహారాన్ని అతనికి ఇవ్వండి. ఎందుకంటే అతడు ఆ వంట వండేటప్పుడు దాని సెగను, వేడిని భరించాడు, ఎంతో శ్రమపడి దానిని తయారుచేశాడు."

(సహీహ్ బుఖారీ: 5460)

## అంతిమ యాత్రల్లో భాగస్వామ్యం- శ్రామికులకు దక్కిన గౌరవం

దైవప్రవక్త బోధనలు కేవలం వేతనాల చెల్లింపులకే పరిమితం కాలేదు; సేవకులకు అత్యున్నత సామాజిక గౌరవాన్ని ప్రసాదిం చాయి. సాధారణ శ్రామికులు మరణిస్తే ప్రవక్త స్వయంగా వారి జనాజా (అంతిమ యాత్ర) ప్రార్థనల్లో పాల్గొనేవారు.

మసీదును రోజూ శుభ్రం చేసే ఒక నల్లటి స్త్రీ కొన్ని రోజులుగా కనిపించకపోవడంతో ప్రవక్త ఆమె క్షేమ సమాచారం అడిగారు. ఆమె మరణించిందని సహాబాలు చెప్పగా, "ఈ విషయం నాకు ముందే ఎందుకు చెప్పలేదు?" అని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ స్త్రీ విషయాన్ని అంత తేలికగా తీసుకోవడం ఆయనకు నచ్చలేదు. వెంటనే "ఆమె సమాధి ఎక్కడ ఉందో చూపించండి" అని అడిగి, స్వయంగా సమాధి వద్దకు వెళ్లి ఆమె ఆత్మశాంతి కోసం దుఆ చేశారు (సహీహ్ అల్-బుఖారీ 458).

అలాగే, శ్రామికులు అనారోగ్యానికి గురైతే వారిని పరామర్శించే సంస్కృతిని ఆయన పెంపొందించారు. ఇందులో ముస్లింలు, ముస్లిమేతరులు అనే తారతమ్యం లేదు. ప్రవక్త వద్ద పనిచేసే ఒక యూదు బాలుడు అస్వస్థతకు గురైనప్పుడు, ప్రవక్త స్వయంగా అతడి ఇంటికి వెళ్లి పరామర్శించిన సంఘటన చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడింది (సహీహ్ బుఖారీ).

## ఈద్‌తో సమానమైన పరామర్శలు, వ్యక్తిగత ఆత్మీయత

కార్మికుల పట్ల దయ చూపడంలో భాగంగా ప్రవక్త అప్పుడప్పుడు వారి ఇళ్లను సందర్శించేవారు. ఆ రాక శ్రామికుల ఇళ్లలో ఈద్ (పండుగ) సంతోషాన్ని నింపేది. హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం:

"దైవప్రవక్త (స) మా ఇంటిని సందర్శించారు. అప్పుడు నేను, నా తల్లి, నా పినతల్లి 'ఉమ్మే హరామ్' ఇంట్లో ఉన్నాము. అది సాధారణ ప్రార్థన సమయం కాకపోయినప్పటికీ, ప్రవక్త గారు మమ్మల్ని నిలబెట్టి తన వెనుక నఫిల్ ప్రార్థన చేయించారు. కుటుంబ సభ్యులందరి ఇహపరాల శ్రేయస్సు కోసం దుఆ చేశారు. నా తల్లి, తన చిన్న సేవకుడైన నా (హజ్రత్ అనస్) కోసం ప్రత్యేకంగా ప్రార్థించమని కోరగా, ప్రవక్త స్పందిస్తూ: 'ఓ అల్లాహ్! ఇతనికి సమృద్ధిగా సంపదను, సంతానాన్ని ప్రసాదించు' అని దుఆ చేశారు."

ఉద్యోగులకు నిర్ణీత జీతం ఇవ్వడమే కాకుండా, వారి వ్యక్తిగత అవసరాలను అడిగి తెలుసుకోవాలని ప్రవక్త ఆచరణ చెబుతోంది. బనూ మఖ్జూమ్ తెగకు చెందిన ఒక వ్యక్తి ప్రకారం, ప్రవక్త తన వద్ద ఉన్న సేవకుడిని నిరంతరం, "నీకు ఏమైనా అవసరం ఉందా?" అని అడిగేవారు (ముస్నద్ అహ్మద్).

రబీఅహ్ ఇబ్న్ కాబ్ అస్లామీ అనే సహాబీ ఉల్లేఖనం ప్రకారం: "నేను ప్రవక్త గారికి ఊజు కోసం నీరు అందించినప్పుడు, వారు 'నీకు ఏది కావాలో కోరుకో' అన్నారు. నేను నా కోరికను తెలపగా, ఆయన 'ఎక్కువగా సజ్దా (ప్రార్థనలు) చెయ్' అని మార్గదర్శనం చేశారు" (సహీహ్ ముస్లిం).

## తప్పులను క్షమించే విలక్షణ గుణం

చాలామంది యజమానులు తమ ఉద్యోగులు చిన్న తప్పు చేస్తే చాలు నిందించడానికీ, శిక్షించడానికీ వెనుకాడరు. కానీ ప్రవక్త ఈ వైఖరిని ఖండించారు. సహనంతో, క్షమాగుణంతో వ్యవహరిం చాలని స్పష్టం చేశారు.

**హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం ప్రకారం** : ఒక వ్యక్తి ప్రవక్త వద్దకు వచ్చి, "నా వద్ద ఒక సేవకుడు ఉన్నాడు. అతడు తరచుగా తప్పులు చేస్తుంటాడు. నేను అతడిని కొట్టవచ్చా?" అని అడిగాడు. ప్రవక్త మౌనంగా ఉన్నారు. అతడు రెండు, మూడు సార్లు అదే ప్రశ్న వేయగా ప్రవక్త, "రోజుకు డెబ్బై సార్లు అతడిని క్షమించు" అని సమాధానమిచ్చారు (అబూ దావూద్, తిర్మిజీ). ఇక్కడ '70' అనేది ఒక సంఖ్య మాత్రమే కాదు, అనంతమైన క్షమాగుణాన్ని చాటడమే దాని ఉద్దేశం. దైవప్రవక్త తన జీవితంలో ఏనాడూ ఏ సేవకుడిపై గానీ, భార్యపై గానీ చేయి చేసుకోలేదని హజ్రత్ ఆయిషా (రజి) పేర్కొన్నారు (సహీహ్ ముస్లిం).

హజ్రత్ అనస్ (రజి) ఒక చమత్కారమైన సంఘటనను పంచు కున్నారు: "నేను చిన్నతనంలో ప్రవక్త సేవలో చేరాను. ఒకసారి ఆయన నన్ను ఒక పనిపై పంపినప్పుడు, 'నేను వెళ్లను' అని అన్నాను (కానీ మనసులో ప్రవక్త మాట వినాలని ఉండి బయలుదేరాను). తోటి పిల్లలు ఆడుకుంటున్న చోట నేను ఆగిపోయాను. వెనుక నుండి ప్రవక్త వచ్చి నా మెడను పట్టుకుని నవ్వుతూ, 'ఓ అనస్! నేను చెప్పిన పనికి వెళ్లావా?' అని అడిగారు. నేను నవ్వుతూ 'అవును అల్లాహ్ ప్రవక్తా! ఇప్పుడే వెళ్తున్నాను' అని చెప్పాను" (సహీహ్ ముస్లిం).

## హింసపై కఠిన హెచ్చరికలు

సేవకులపై, శ్రామికులపై యజమానులు చేయిచేసుకుంటే ప్రవక్త ఎంతో వేదనకు గురయ్యేవారు. హజ్రత్ అబూ మసూద్ (రజి) తన జీవితంలో జరిగిన ఒక సంఘటనను ఇలా వివరిస్తారు:

“నేను నా సేవకుడిని కొడుతుండగా వెనుక నుండి ఒక స్వరం వినిపించింది. కోపావేశంలో ఉన్నందున ఆ గొంతు ఎవరిదో నేను గుర్తుపట్టలేకపోయాను. దగ్గరకు వచ్చాక అది దైవప్రవక్త అని తెలిసింది. ‘అబూ మసూద్! నీకు ఈ సేవకుడిపై ఉన్న అధికారం కంటే అల్లాహ్‌కు నీపై అత్యధిక అధికారం ఉందని తెలుసుకో!’ అని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. ఆ మాట వినగానే నా చేతిలోని తలాటా కిందపడిపోయింది. ‘ఇప్పటి నుండి నేను ఏ సేవకుడినీ కొట్టను, అల్లాహ్ ప్రీతి కోసం ఇతడికి స్వేచ్ఛనిస్తూ విముక్తి చేస్తున్నాను’ అని అన్నాను. దానికి ప్రవక్త, ‘నీవు గనుక అలా చేయకపోతే నరకాగ్ని నిన్ను కాల్చివేసేది’ అన్నారు” (సహీహ్ ముస్లిం).

**హజ్రత్ ఆయిషా (రజి) ఉల్లేఖనం ప్రకారం** : ఒక వ్యక్తి ప్రవక్త వద్దకు వచ్చి నిలబడి, “ఓ అల్లాహ్ ప్రవక్తా! నా సేవకులు నన్ను మోసం చేస్తారు, నా మాట వినరు. అందుకు నేను వారిని తిడతాను, కొడతాను. నా ప్రవర్తన సరైనదేనా?” అని అడిగాడు. దానికి ప్రవక్త: “వారు చేసిన మోసానికి, నీవు ఇచ్చిన శిక్షకు లెక్కించ బడుతుంది. శిక్ష న్యాయబద్ధంగా ఉంటే పర్వాలేదు, కానీ నీ శిక్ష వారు చేసిన తప్పు కంటే ఎక్కువగా ఉంటే దానికి నీవు పరిహారం చెల్లించుకోవాల్సి వస్తుంది” అన్నారు. ఆ మాట వినగానే ఆ వ్యక్తి ఏడుస్తూ, “వారిని నా నుండి వేరు చేయడమే మేలని భావిస్తు న్నాను. వారందరినీ స్వతంత్రులుగా విముక్తి చేస్తున్నాను, దానికి మిమ్మల్నే సాక్షిగా పెడుతున్నాను” అని ప్రకటించాడు (తిర్మిజీ).

## పదజాలంలో మార్పు- ఆత్మగౌరవ పునరుద్ధరణ

ఇస్లాం ఆవిర్భావానికి ముందు బానిసలను లేదా సేవకులను చులకనగా చూసేవారు. సేవకుడు యజమానిని “నా ప్రభూ!” అని, యజమాని సేవకుడిని “బానిసా!” అని పిలిచేవారు. ప్రవక్త ఈ విధానాన్ని పూర్తిగా సంస్కరించి, “మీరందరూ అల్లాహ్ దాసులే” అని చాటారు (సహీహ్ బుఖారీ). గౌరవప్రదమైన పదాలను మాత్రమే ఉపయోగించాలని, “నా యువకుడా”, “ఓ బిడ్డా” అని పిలవాలే తప్ప తక్కువ చేసి మాట్లాడకూడదని ఆదేశిం చారు. బానిసలకు ఇచ్చిన ఈ గౌరవం, నేటి శ్రామిక వర్గానికి సైతం పూర్తిగా వర్తిస్తుంది.

సమాజంలో అత్యంత దిగువన ఉండే శ్రామిక వర్గం పట్ల ప్రవక్త ముహమ్మద్ (స)కు ఉన్న అపారమైన ప్రేమకు ఆయన చివరి ఘడియలే నిదర్శనం. తన ఊపిరి ఆగిపోతున్న ఆ తీవ్రమైన వేదనలో కూడా ఆయన మానవాళికి ఇచ్చిన చివరి సందేశం: “నమాజ్ (ప్రార్థనలు) క్రమం తప్పకుండా చేయండి, మీ సేవకుల (కార్మికుల) హక్కుల పట్ల జాగ్రత్త వహించండి” (ఇబ్న్ మాజా).

## దౌర్జన్యం, దురభిమానాలు గూడుకట్టుకోవడం

మనిషి హృదయంలో ద్వేషం, దురభిమానాలు గనక గూడు కట్టుకోవడం ప్రారంభిస్తే అవి ఓ పట్టాన అతడ్ని వదలవు, క్రమక్రమంగా అవి తీవ్రమైన ప్రతీకారం రూపుదాల్చి చివరికి హింసా, హత్యాకాండలకు దారితీస్తాయి. ద్వేషం, దురభిమానాలు మనిషికి పరలోకంలోనే కాదు, ఇహలోకంలో కూడా వినాశం తెచ్చిపెడుతాయి. కనుక విశ్వాసి వీటి పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి.

దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా తెలిపారు : “ప్రళయదినాన దౌర్జన్యం (దౌర్జన్యపరుడికి) అంధకారంగా మారుతుంది. (బుఖారీ)

పీడితుడు తన హక్కు ఇప్పించమని మాత్రమే దేవుడ్ని మొర పెట్టుకుంటాడు. దేవుడు ఏ హక్కుదారునికీ అతని హక్కు ఇప్పించకుండా ఉండడు కాబట్టి పీడితుని శాపానికి ఆర్తనాదాలకు భయపడండి. (మిష్కాత్)

దైవప్రవక్త(స) మాట్లాడుతూ, “దేవుడు దౌర్జన్యపరుడికి (హద్దు మీరేదాకా) విడుపు ఇస్తాడు. చివరికి దేవుడు అతడ్ని పట్టుకుంటే ఇక అతడ్ని (శిక్షించకుండా) వదిలిపెట్టడు” అని అన్నారు. ఆ తర్వాత ఆయన ఖుర్ఆన్‌లోని ఈ సూక్తి పఠించారు. “నీ ప్రభువు ఏదైనా పట్టణాన్ని పట్టుకోవటం జరిగితే (ఇక దానికి వినాశనం మూడినట్లే) ఆయన పట్టు చాలా కఠినంగా, ఎంతో బాధాకరంగా ఉంటుంది. (11: 102)

నేను మీ మధ్య న్యాయం చేకూర్చడానికి పంపబడ్డాను. ఎవరైనా ఓ జానెడు భూమి అయినా బలవంతంగా స్వాధీనం చేసుకుంటే దేవుడు అతని మెడలో ఏడు భూమండలాల కంఠపాశం వేస్తాడు. (ముస్లిమ్)

ఒక వ్యక్తి దుర్మార్గుడని తెలిసి కూడా ఎవరైనా అతడ్ని సమర్థిస్తే అలాంటి వాడు ఇస్లాం నుండి బయటికి వెళ్ళిపోయినట్లే. (మిష్కాత్)

అధర్మం, అక్రమ పనులలో తన తెగ (కులం, జాతి, వర్గం) వారికి సహకరించేవాడు బావిలో పడిపోతున్న ఒంటె తోక పట్టుకుని ఆ ఒంటెతోపాటు తాను బావిలోపడిపోయే వ్యక్తి లాంటి వాడు (అబూదావూద్)

దురభిమానం వైపు పిలిచేవాడు మనలోని వాడు కాదు. దురభిమానంతో యుద్ధం చేసేవాడు కూడా మనలోని వాడు కాడు. ధురభిమానంతో రగిలిపోయే స్థితిలో చనిపోయే వాడు కూడా మనలోనివాడు కాడు. (అబూ దావూద్)

**- ముహమ్మద్ వహీదుద్దీన్**



**- ముహమ్మద్**



# ఇంట్లోనే స్వర్గసీమ

- అస్మా అజీజ్

**మారుతున్న కాలంతో పాటు సాంకేతిక పురోగతి మన నిత్య జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. సోషల్ మీడియా, స్మార్ట్‌ఫోన్లు, డిజిటల్ వినోదం మన బాంధవ్యాల మధ్య సరికొత్త గోడలను నిర్మిస్తున్నాయి. ఒకే ఇంట్లో ఉంటూ కూడా ఒకరికొకరు దూరమవుతున్న ఈ రోజుల్లో... కుటుంబ సౌధాన్ని ప్రశాంతంగా, ప్రేమమయంగా ఎలా మార్చుకోవాలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) శతాబ్దాల క్రితమే ఆచరించి చూపారు. ఇంటిని ఆనంద నిలయంగా మార్చే ఆ 7 అమూల్యమైన సూత్రాలు ఇవే...**

యుగాలు మారినా, జీవన శైలులు ఎంతగా రూపాంతరం చెందినా మానవ సంబంధాలను నిలబెట్టే నైతిక విలువలు ఎప్పటికీ మారవు. వృత్తిధర్మాన్ని, కుటుంబ బాధ్యతలను సముచిత రీతిలో సమతుల్యం (Balance) చేసుకోవడంలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అత్యుత్తమ ఆదర్శంగా నిలిచారు. బయటి ప్రపంచం ఎంత గందరగోళంగా ఉన్నా, ఆయన చూపిన మంచి ప్రవర్తనా నియమావళిని (అదబ్) అనుసరిస్తే మన ఇళ్లను శాంతిభద్రతలకు నిలయంగా మార్చుకోవచ్చు.

ప్రవక్త (స) తమ గృహంలో రోజువారీ వ్యవహారాలను నడిపిన తీరును వివరించే ఏడు హదీసుల సమగ్ర సమాహారం ఇక్కడ చూడవచ్చు:

## 1. వృత్తి - కుటుంబ జీవితాల సమతుల్యత

జీవితంలో చాలామంది ఉద్యోగానికో, ఇతర పనులకో ఇచ్చే ప్రాధాన్యత సొంత కుటుంబానికి ఇవ్వలేకపోతు న్నారు. దీనిపై ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎంతో స్పష్టమైన ఉపదేశం ఇచ్చారు:

"నిశ్చయంగా నీ ఆత్మకు నీపై హక్కు ఉంది, నీ ప్రభువుకు నీపై హక్కు ఉంది. నీ భార్యకు (కుటుంబానికి) నీపై హక్కు ఉంది; కాబట్టి హక్కు కలిగిన ప్రతి ఒక్కరికీ వారి సముచిత హక్కును చెల్లించు." (సహీహ్ అల్-బుఖారీ)

కేవలం ఆరాధనలకే పరిమితమై, గృహ బాధ్యతలను నిర్లక్ష్యం చేస్తున్న ఒక అనుచరుడిని (సహాబీ) ఉద్దేశించి ప్రవక్త గారు ఈ మార్గదర్శనం చేశారు. జీవితంలో పరిపూర్ణ సమతుల్యత సాధిం చాలంటే గృహంలో ఉన్నవారితోనూ, వెలుపల ఉన్నవారితోనూ సమన్యాయంతో ప్రవర్తించాలి. జీవిత భాగస్వామికి, పిల్లలకు తగిన సమయాన్ని కేటాయించడం, ఇంటిని శుభ్రంగా ఉంచు కోవడం ఇందులో అత్యంత ప్రధానమైనవి.

## 2. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం

పరిశుభ్రత అనేది కేవలం బాహ్యమైన విషయం కాదు, అది ఇంటి వాతావరణాన్ని ఆహ్లాదకరంగా మార్చే శక్తి. దేహాన్ని ఆరోగ్యంగా, శుభ్రంగా ఉంచుకోవడానికి ఎల్లప్పుడూ ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రవక్త గారు ఈ విషయంలో ప్రత్యక్ష మార్గదర్శకంగా నిలిచారు. ఆయన రాత్రి వేళల్లో నిద్రలేవగానే మిస్వాక్ (సివాక్/దంత ధావన పుల్ల)తో నోటిని శుభ్రం చేసుకునే వారు. అలాగే బయటి నుండి నివాసానికి రాగానే ప్రథమంగా చేసే పని మిస్వాక్‌తో నోరు శుభ్రం చేసుకోవడమే.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం ప్రవక్త (స) ఇలా అన్నారు: "ఒక తండ్రి తన సంతానానికి నేర్పించినట్లే, నేను మీకు మార్గదర్శ నం చేస్తున్నాను. మీలో ఎవరైనా శౌచాల యానికి వెళ్లినప్పుడు ఖిబ్లా వైపు ముఖం గానీ, వెనుక భాగం గానీ పెట్టకూడదు; అలాగే కుడి చేతితో శుభ్రం చేసుకోకూడదు."

(సునన్ అబూ దావూద్)

పిల్లలకు శౌచం, పరిశుభ్రత, మంచి అలవాట్లను నేర్పించేటప్పుడు కఠినత్వంతో కాక, అమితమైన వాత్సల్యంతో నేర్పించాలని ఈ హదీస్ ప్రబోధిస్తోంది.

## 3. గృహంలో నమాజ్ (ఆరాధన) స్థిరపరచడం

"కలిసి ప్రార్థించే కుటుంబం, నిరంతరం ఐక్యతతో వర్ధిల్లుతుంది" అనేది ఒక అనుభవపూర్వక నిజం. కుటుంబసమేతంగా ఆరాధనల్లో పాల్గొనడం వల్ల గృహ వాతావరణంలో దైవభక్తి నెలకొంటుంది. ఇది అల్లాహ్‌తో అనుబంధాన్ని బలపరచడమే కాకుండా, లౌకిక విషయాల కంటే ఆధ్యాత్మికతకు ప్రాధాన్యత ఇచ్చే దృక్పథాన్ని ఇంట్లోని ప్రతి ఒక్కరిలోనూ పెంచుతుంది.

ఆయిషా (రజి అల్లాహు అన్హా) కథనం ప్రకారం: "రంజాన్ చివరి పది రాత్రులు రాగానే ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నడుము బిగించి, రాత్రంతా ఆరాధనలో గడిపేవారు, తన కుటుంబ సభ్యులను సైతం ఆరాధన కొరకు మేల్కొలిపేవారు."

(సహీహ్ అల్-బుఖారీ, సహీహ్ ముస్లిం)

ఈ నిష్ఠను కేవలం ప్రత్యేక సమయాలకే పరిమితం చేయకుండా, సంవత్సరం పొడవునా ఒక నిత్య జీవన విధానంగా మలచు కోవాలని ప్రవక్త ఆచరణ మనకు తెలుపుతోంది.

## 4. కష్ట సమయాల్లో సహనం వహించడం

సాంసారిక జీవితంలో సమృద్ధి కలిగిన రోజులతో పాటు క్లిష్టమైన పరిస్థితులు ఎదురుకావడం సహజం. ఇంట్లో భోజనానికి ఆహారం


**చందాదారులకు విజ్ఞప్తి**

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

లభించని సమయాల్లో ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎన్నడూ అసంతృప్తి చెందలేదు, కుటుంబ సభ్యులను ఇబ్బందికి గురి చేయలేదు. బదులుగా, ఆయన ఆ రోజు ఉపవాసముం డాలని సంకల్పించుకుని ప్రశాంతంగా గడిపేవారు.

ఆయిషా (రజి అల్లాహు అన్హా) తెలిపారు: "ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నా వద్దకు వచ్చి 'ఇంట్లో భుజించడానికి ఏదైనా ఉందా?' అని అడిగేవారు. మేము 'ఏమీ లేదు' అని మనవి చేస్తే, 'అయితే నేను ఈ రోజు ఉపవాసం ఉంటాను' అని చెప్పేవారు." (సహీహ్ అల్-బుఖారీ)

పరిస్థితులకు అనుగుణంగా సర్దుకుపోయే తత్వం కుటుంబంలో ఓర్పును, మానసిక దృఢత్వాన్ని, దైవంపై నిశ్చలమైన నమ్మకాన్ని (తవక్కుల్) పెంపొందిస్తుంది.

## 5. గృహ బాధ్యతలను పంచుకోవడం-చొరవ చూపడం

సమాజంలో ఎంతటి గొప్ప స్థానంలో ఉన్నవారైనా ఇంట్లో మాత్రం ఒక సభ్యుడేననే సత్యాన్ని ప్రవక్త ఆచరించి చూపారు. దైవ సందేశహరులైన ముహమ్మద్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) స్వయంగా గృహ పనులను నిర్వర్తించేవారు.

ప్రవక్త గారి గృహ జీవితం గురించి ఆయిషా (రజి అల్లాహు అన్హా)ను ప్రశ్నించగా ఆవిడ ఇలా వివరించారు: "ఇంటి పనుల్లో నిమగ్నమై ఉండేవారు; నమాజ్ సమయం ఆసన్నమవ్వగానే నమాజ్ కొరకు బయలుదేరేవారు." (సహీహ్ అల్-బుఖారీ)

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇతరుల సహాయం కోసం నిరీక్షించకుండా తమ సొంత పనులను తామే చేసుకునేవారు. తమ చెప్పులు కుట్టుకోవడం, వస్త్రాలకు పేలికలు వేసుకోవడం, బట్టలు ఉతుక్కోవడం, పాలు పిదకడం వంటి పనులను స్వయంగా నిర్వహించేవారు.

ఇంటి పని అనేది కుటుంబ సభ్యులందరి ఉమ్మడి బాధ్యత (Teamwork). ప్రతి ఒక్కరూ ఒక బృందంగా పనిచేసి ఇల్లు పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉండేలా చూసుకోవాలని ఈ ఆచరణ చెబుతోంది.

## 6. కుటుంబ సభ్యులకు మృదువుగా హితోపదేశం చేయడం

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) బయటి ప్రపంచంలో ప్రజలకు బోధనలు చేయడమే కాకుండా, తమ గృహంలో భార్యాపిల్లలకు ఎంతో ప్రేమతో, సున్నితంగా మార్గదర్శనం చేసేవారు.

ఆయిషా (రజి అల్లాహు అన్హా) ఒకసారి అదుపు తప్పిన ఒంటెను కోపంతో కొడుతుండగా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా వారించారు:

"నీవు మృదుత్వాన్ని అంగీకరించాలి. ఏదైనా విషయంలో దయ, మృదుత్వం ఉంటే అది దానికి శోభను చేకూరుస్తుంది; అది లోపిస్తే ఆ విషయాన్ని వికృతం చేస్తుంది." (అల్-అదబ్ అల్-ముఫ్రద్)

పవిత్ర ఖురాన్‌లో అల్లాహ్ ఈ విధంగా పేర్కొన్నాడు: "అల్లాహ్ అపారమైన దయ వల్లే నీవు వారితో మృదువుగా ప్రవర్తించావు. ఒకవేళ నీవు కఠిన మనస్కుడవై, నిర్దయగా ఉండి ఉంటే వారు నీ నుండి దూరమైపోయేవారు..." (ఆల్-ఇమ్రాన్ 3:159)

## 7. అతిథులను ఆదరించడం, సత్కరించడం

పిల్లలలో సదాచారాన్ని, సామాజిక స్పృహను పెంపొందించడానికి అతిథి సత్కారం ఒక అద్భుతమైన మార్గం. ఇంట్లో అతిథులకు స్వాగతం పలకడం, భోజనం, పానీయాలు వడ్డించడంలో పిల్లలను స్వయంగా భాగస్వాములను చేయాలి.

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అతిథి సత్కార ప్రాధాన్యతను వివరిస్తూ ఇలా అన్నారు:

"అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని విశ్వసించేవారు తమ అతిథిని గౌరవించాలి. అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని విశ్వసించేవారు పొరుగువారితో సద్భావన కలిగి ఉండాలి. అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని విశ్వసించేవారు శ్రేయోదాయకమైన మాటలు మాట్లాడాలి లేదా మౌనం వహించాలి."(ముస్నద్ అహ్మద్)

ప్రవక్త గారికి ప్రథమంగా దివ్యసందేశం (వహీ) వచ్చిన క్లిష్ట సమయంలో ఆయన ధర్మపత్ని ఖదీజా (రజి అల్లాహు అన్హా) ప్రవక్త గారి మహోన్నత గుణాలను స్మరిస్తూ: "అల్లాహ్ మిమ్మల్ని ఎన్నటికీ అవమానించడు. మీరు బంధుత్వాలను నిలుపుతారు, నిర్భాగ్యులను ఆదుకుంటారు, అతిథులను ఉదారంగా సత్కరిస్తారు" అని ధైర్యం చెప్పారు.

ఉత్తమ నడవడిక (అఖ్లాక్) అనేది జీవితానికి అత్యంత కీలకమైన అభరణం. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రవచించినట్లు:


"ఒక తండ్రి తన సంతానానికి ప్రదానం చేయగల అత్యుత్తమైన కానుక- మంచి ప్రవర్తన, సదాచారములను నేర్పించడమే."

(సునన్ అత్-తిర్మిజి)

మన జీవితాల్లోనూ, మన పిల్లల పెంపకంలోనూ ఇటువంటి మహోన్నత గుణాలను పెంపొందింపజేసుకుని ప్రతి ఇల్లు ఒక ఆనంద నిలయంగా మారాలని కోరుకుందాం. ●

# కనువిప్పు

**- అబ్దుల్ సత్తార్, మహబూబాబాద్**



**'నమస్తే సార్! రండి కూర్చొండి. కటింగా? ట్రిమ్మింగా?" అంటూ హమీద్ భాయ్‌ను ఆహ్వానించాడు వెల్‌కమ్ సెలూన్ వెంకన్న. "కటింగ్ చేయ్ వెంకన్నా.. బాగా పెరిగింది.. ఈసారి చాలా చిన్నగా వుండాలి కటింగ్" అంటూ సీటులో కూర్చున్నాడు హమీద్ భాయ్.**

కాసేపటి తర్వాత.. 'సార్ రెండు వందలివ్వండి. కటింగ్‌తోపాటు కలరింగ్ కూడ వేశాను. రేట్లు పెరిగిపోయినయ్ సార్' అన్నాడు వెంకన్న. "ఏమయ్యా పోయిన్నెల 150 రూపాయలే ఇచ్చాను. గుర్తులేదా? సరేలే ఈ సారికి 160 రూపాయలు ఇస్తున్నాను తీసుకో. అంటూ బయటికి వెళ్ళిపోయాడు హమీద్.

★★★

ఓ పదిరోజుల తర్వాత.. 'వెంకన్న! కొంచెం ట్రిమ్మింగ్ చేయ వయ్యా! అంటూ మళ్ళీ వెల్‌కమ్ సెలూన్‌లోకి దూరాడు హమీద్ భాయ్. 'సరే సార్ రండి... ఫ్రీ గానే ఉన్నాను" అంటూ కుర్చీలోకి ఆహ్వానించాడు వెంకన్న.

'సార్ ఇదేంటి యాభై రూపాయలే ఇస్తున్నారు. ట్రిమ్మింగ్, కలరింగ్ కలిపి వంద రూపాయలు ఇవ్వాలి' అంటూ వాపోయాడు వెంకన్న. 'ఏమయ్యా రేట్లుఇంతగా పెంచేశారు. పోయిన నెల యాభై రూపాయలే ఇచ్చాను కదా?' సరేలే ఓ 60 రూపాయలు తీసుకో..అంటూ వెంకన్న చేతిలో పెట్టి బయటికి నడిచాడు హమీద్ భాయ్.

★★★

ఓ పది రోజులు గడిచిపోయినై... హమీద్ తన మిత్ర బృందంతో కలిసి మహాప్రవక్త ముహమ్మద్(స) జన్మ మాసం సందర్భంగా తను ప్రాతినిధ్యం చేస్తున్న ఓ ధార్మిక సంస్థ తరపున ప్రవక్త(స) వారి సందేశ ప్రచారాన్ని చేపట్టాడు. అందులో ప్రవక్త జీవిత చరిత్ర, వారు(స) బోధించిన సూక్తుల స్టిక్కర్, కరపత్రాలు, జీవిత మర్మం, ఇహపరలోక సాఫల్య సోపానాలు మొదలైన విషయాలు ఇల్లిల్లూ, వాడవాడలా సభలు, సమావేశాలు చేపడుతున్నాడు

★★★

ఓ రోజు సందేశ ప్రచారంలో భాగంగా హమీద్ తన మిత్రులతో వెల్‌కమ్ సెలూన్‌లో ప్రవేశించి వెంకన్నా... ఈ రోజు నీకు, మీ షాపులో పనిచేస్తున్న వారందరికీ గొప్ప సందేశాన్ని ఇచ్చే సాహిత్యం తెచ్చాను. ఇందులో ఏకేశ్వరోపాసన, సామాజిక, ధార్మిక, అనేక హితబోధనలున్నాయి. ఇవన్నీ నీకు కానుకగా ఇస్తున్నాను. ఎందుకండీ ఈ నెల మహాప్రవక్త ముహమ్మద్(స) జన్మమాసం... అంటూ కొన్ని స్టిక్కర్లు, కరపత్రాలు, పుస్తకాలు వెంకన్న చేతికందించాడు హమీద్. ఆనందంతో స్వీకరించాడు వెంకన్న.

★★★

ఓ పదిరోజుల తర్వాత వెంకన్నా.. అంటూ సెలూన్‌లో ప్రవేశించాడు హమీద్. 'సార్ రండీ! మీరిచ్చిన కరపత్రాలు, స్టిక్కర్లు, మొత్తం చదివేశాను. చాలా బాగున్నాయి. ఆఁ కటింగా.. ట్రిమ్మింగా' అడిగాడు వెంకన్న.

ట్రిమ్మింగ్ చేయి అన్నాడు హమీద్. కలరింగ్ కూడా కానిచ్చాడు వెంకన్న. ఏదో ఆలోచిస్తూ ఎంతివ్వాలి? అడిగాడు హమీద్. 'వంద' అన్నాడు వెంకన్న. 'ఔను మర్చిపోయాను... నీకు నచ్చిన అంశం మహాప్రవక్త (స) జీవితంలో ఏంటిది? అడిగాడు హమీద్. "పనికి తగ్గ వేతనం ఇవ్వాలి", "కూలివాని చెమట ఆరకముందే అతని కూలి చెల్లించాలి", "పలికితే న్యాయమే పలకండి", "ప్రవక్త అడుగుజాడలు" అని చెప్పుకుంటూ పోతున్నాడు వెంకన్న. 'సార్ నిజంగా ప్రవక్త(స) గారి ప్రవచనాలను అందరూ పాటిస్తే ఈ సమాజం ఎప్పుడో బాగుపడేది సార్. ఇలా అంటుంటే... హమీద్‌కు వెంకన్న మాటల్లో ఏదో గుణపాఠం తనకే ఇస్తున్నట్లుగా.. ఏదో తన తప్పును వెక్కిరిస్తున్నట్లుగా భావించి, వెంకన్న అడిగినట్లుగా జేబులోంచి వంద నోటు అందించి బయటపడ్డాడు హమీద్.

# హిరా గుహలో మక్కా చంద్రుడు



**- ఉస్మాన్ ఖాన్**

భూమి గుండెలపై
అజ్ఞాన నాగులు విషం కక్కుతున్న కాలం అది...
ఇసుక తుఫాన్ల మధ్య
మానవత్వం తన సమాధిని తానే తవ్వుకుంటున్న యుగం అది...
పుట్టిన పసిపాపల రోదనలను
ఎడారి ఇసుక గర్భంలో సజీవంగా సమాధి చేస్తూ,
బలహీనుల రక్తంతో
అహంకారపు కోటలకు పునాదులు వేస్తున్న వేళ –
హిరా గుహ నిశ్శబ్ద గర్భంలో
'వహీ' సూర్యుడు ఉదయించాడు!

'ఇఖ్రా!' అనే ఆకాశవాణి
హిరా గర్భాన్ని తాకిన వేళ,
శతాబ్దాల అంధకారం
తన మరణ శాసనాన్ని తానే రాసుకుంది!

'సూర్యుణ్ణి కుడిచేతిలో, చంద్రుణ్ణి ఎడమచేతిలో ఉంచినా –
సత్య దీపాన్ని ఆర్పలేరు!'
అని గర్జించిన ఆ స్వరం
'సఫా' కొండలను మాత్రమే కాదు,
కాలపు గోడలను కంపింపజేసింది!

'లా ఇలాహ ఇల్లల్లాహ్' అనే నినాదం
ఎడారి గాలుల్లో విహరించిన వేళ,
కాబా విగ్రహాలు మాత్రమే కాదు –
సామ్రాజ్యాల సింహాసనాలపై కూర్చున్న
అహంకార ఫిరౌన్లు సైతం చిగురుటాకుల్లా వణికిపోయారు!

బద్ర్ మైదానంలో
మూడువందల పదమూడు హృదయాలు మాత్రమే కనిపించాయి
శత్రువులకు...
కానీ వాటి వెనుక
'హస్బునల్లాహు వ నీమల్ వకీల్ ' అనే విశ్వాస పర్వతం నిలిచి ఉందని
వారికి తెలియదు!

'ఖందక్ ' తవ్వుతున్న చేతుల్లో
ఉన్నవి పారలు కావు...
ఉమ్మత్ భవిష్యత్తును చెక్కుతున్న ఉక్కు సంకల్పాలు!

కడుపుకు రాళ్లు కట్టుకున్నా,
హృదయాల్లో ఆశను నాటిన రహ్మతుల్లిల్ ఆలమీన్!

మక్కా విజయం నాడు
పదివేల ఖడ్గాలు తలవంచాయి...
కానీ చరిత్రను జయించింది ఖడ్గాల పదును కాదు –
'లా తస్రీబ అలైకుముల్ యౌమ్ ' అనే క్షమా సముద్రం!

బిలాల్ అజాన్
కాబా శిఖరాన్ని తాకిన క్షణం,
నలుపు – తెలుపు, అరబ్ – అజమ్, ధనిక – పేద అనే
శతాబ్దాల అబద్ధపు గోడలు ఇసుక మేడల్లా కూలిపోయాయి!

మనిషి గొప్పతనం రంగులో లేదని, వంశంలో లేదని,
'ఇన్న అక్రమకుమ్ ఇన్దల్లాహి అత్ఖాకుమ్'
అనే దివ్య ప్రకటనతో
చరిత్ర నుదుటిపై స్వర్ణాక్షరాలు చెక్కిన మహా సంస్కర్త ఆయన!

ఖడ్గాలు భూభాగాలను జయించగలవు... కానీ హృదయాలను కాదు!
ఆయన రాజ్యాలను కాదు – మనసులను గెలిచాడు!

అందుకే...
ఖుస్రోలు మట్టిలో కలిశారు...
ఖైసర్లు చరిత్రలో కలసిపోయారు...
సామ్రాజ్యాల జెండాలు చిరిగిపోయాయి...
కానీ హిరా గుహలో వెలిగిన ఆ వహీ జ్యోతి మాత్రం
ఇప్పటికీ కోట్లాది హృదయాలలో
ఫజ్ర్ సూర్యుడిలా ఉదయిస్తూనే ఉంది.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2026-2028 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**